ఇంజినీరు కాకున్నా ఎగిరే కారు తయారు చేశాడు!

వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

ఢిల్లీలో మళ్లీ భగ్గుమన్న 'సర్' వ్యతిరేక ఆందోళనలు!

Published From : Rangareddy VOLUME : 01 Issue : 306 Saturday, 24-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal–Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

సమన్వయంతోనే నేరాల కట్టడి

సురక్షిత దక్షిణ భారతమే లక్ష్యంగా పనిచేయాలి

- నేరస్తుల సమాచార మార్పిడికి ఉమ్మడి వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- దక్షిణాది రాష్ట్రాల పోలీసులకు సీఎం రేవంత్ పిలుపు
- మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ ముందడుగు
- ఈగల్ పనితీరుకు కేంద్రం నుంచి 80 శాతానికి పైగా మార్కులు
- ఆహార కల్తీ, ఔషధాల నియంత్రణకు ప్రత్యేక విభాగం
- అమర పోలీసుల కుటుంబాలకు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల పరిహారం
- దక్షిణాది రాష్ట్రాల పోలీస్ ప్రాంతీయ సమన్వయ సమావేశాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్,

దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నేరాలకు రాష్ట్రాల సరిహద్దులు అడ్డుకావని, వాటిని సమర్థంగా అరికట్టాలంటే ఉమ్మడి కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. నేరస్తుల సమాచార మార్పిడికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ప్రాంతీయ సమన్వయ కమిటీ సదస్సుతో

-మిగతా 2 లో



బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం!

- రెండు పార్టీలు ఒక్కటేనన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని ఆరోపణ
- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటనపై ప్రశ్నలు
- బీజేపీ అభ్యర్థుల ప్రకటన తర్వాతే బీఆర్ఎస్ అభ్యర్థుల బరిలోకి దిగుతారని వ్యాఖ్య
- పార్లమెంట్‌లో కేంద్ర బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని విమర్శ
- కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ హామీ ఏమైందని నిలదీత
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ప్రశ్నలు
- నిజామాబాద్ అర్బన్‌లో మీడియా సమావేశంలో వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని వ్యాఖ్యానించారు. గురువారం నిజామాబాద్ అర్బన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందనడానికి త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు బీఆర్ఎస్ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించకపోవడమే నిదర్శనమని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ముందుగా బీజేపీ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత బీఆర్ఎస్ నామమాత్రంగా అభ్యర్థులను బరిలోకి దింపుతుందని ఆరోపించారు.

-మిగతా 2 లో

భారత్-చైనా సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తతలు

- ఎల్ఏసీ వెంబడి చైనా సైనికుల కదలికలపై ఆందోళన
- పెట్రోలింగ్ విధానాలను మార్చుకుంటున్న చైనా బలగాలు
- అరుణాచల్‌లో పలుచోట్ల ఎదురెదురుగా ఇరు దేశాల సైనికులు
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న విదేశాంగ శాఖ
- సమస్యల పరిష్కారానికి దౌత్య, సైనిక చర్చలు
- చైనా బలగాలను ఎదుర్కొనేందుకు రంగంలోకి శౌర్య కమాండోలు
- సరిహద్దు భద్రతకు డ్రోన్లు, ప్రత్యేక శిక్షణ
- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్ కీలక వ్యాఖ్యలు

అరెస్టులతో మా ఉద్యమాన్ని ఆపలేరు!

- జైలులో ఉన్నా.. బయట ఉన్నా పోరాటం కొనసాగుతుంది
- సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టీకరణ
- ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ విచారణకు హాజరైన ఇద్దరు నేతలు
- జంతర్‌మంతర్ ఆందోళనపై మరో కేసులో పోలీసుల నోటీసులు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గబోమని వ్యాఖ్యలు

పాక్ సైనికులకు అంత్యక్రియలు చేసింది మేమే!

- కార్గిల్ యుద్ధాన్ని గుర్తుచేస్తూ పాక్‌పై భారత్ ధ్వజం
- సొంత సైనికుల మృతదేహాలనే స్వీకరించని పాకిస్థాన్
- ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు చేసిన భారత సైన్యం
- మత విశ్వాసాల గురించి మాట్లాడే అర్హత మీకెక్కడిది?
- ఉగ్రవాద బాధితుల హక్కులను విస్మరిస్తున్నారంటూ అభ్యంతరం
- కశ్మీర్‌లో రహస్య ఖననాలపై ఐరాస నివేదికలో ప్రస్తావన
- నివేదికలోని ఆరోపణలపై స్పందించిన భారత ప్రతినిధి
- ఐరాస వేదికగా పాక్ వైఖరిని ఎండగట్టిన భారత్

ఐరాస

మత స్వేచ్ఛ, విశ్వాసాలు, అంత్యక్రియల హక్కుల గురించి మాట్లాడుతున్న పాకిస్థాన్‌పై ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 1999 కార్గిల్ యుద్ధంలో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని పాకిస్థాన్‌కు మత సంప్రదాయాల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించింది. ఆనాడు పాక్ సైనికుల మృతదేహాలను భారత సైన్యమే స్వాధీనం చేసుకుని, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిందని గుర్తుచేసింది.

-మిగతా 2 లో

రాహుల్ గాంధీ వర్సెస్ ప్రియాంకా గాంధీ?

- కాంగ్రెస్‌లో విబేధాలున్నాయంటున్న బీజేపీ
- రైహాన్ చిత్ర ప్రదర్శనలో 74 ఫొటోల తొలగింపుతో వివాదం
- అప్రకటిత సెన్సార్‌షిప్ అంటూ కాంగ్రెస్ ఆగ్రహం
- మేనల్లుడి వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన బీజేపీ
- విభేదాల ప్రచారాన్ని ఖండించిన కాంగ్రెస్

ఏఐతో మానవాళి మనుగడకు ముప్పు!

- పదేళ్లలో వినాశనానికి 33 శాతం అవకాశమంటూ హెచ్చరిక
- గూగుల్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ సంచలన వ్యాఖ్యలు
- మానవ నియంత్రణ దాటితే తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన
- భద్రతా ప్రమాణాలను విస్మరిస్తున్న టెక్ కంపెనీలపై విమర్శలు

పసి ప్రాణాలతో చెలగాటమా?

- దాదాపు పది రోజులుగా చిన్నారులకు టీకాలు అందడం లేదా?
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నాతో వైద్య సేవలకు అంతరాయం!
- గూగుల్‌లో, ప్రభుత్వ వెబ్‌సైట్లలో తప్పులతడకగా అధికారుల ఫోన్ నంబర్లు
- వైద్య ఆరోగ్యశాఖకు మంత్రి ఉన్నా.. క్షేత్రస్థాయిలో పాలన సున్నా!

వికారాబాద్, అక్టోబర్ 23 (వార్త సంధ్య):

పసిపిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారా? చిన్నారులకు సకాలంలో అందాల్సిన టీకాల విషయంలో ఇంత నిర్లక్ష్యమా? దాదాపు పది రోజులుగా వ్యాక్సిన్లు అందుబాటులో లేవంటూ వస్తున్న ఆరోపణలు వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఒకవైపు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల ఆందోళనతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోందనే విమర్శలు వినిపిస్తుండగా, మరోవైపు చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆరోగ్యశాఖకు మంత్రి, ఉన్నతాధికారులు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోతే సామాన్య ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి?

వ్యాక్సిన్లు ఎక్కడ? బాధ్యత ఎవరిది?

చిన్నారులకు వయస్సు, టీకాల షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్లు



అందించడం ప్రజారోగ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన బాధ్యత. టీకాలు అందుబాటులో లేకపోవడం వల్ల తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడితే బాధ్యత ఎవరిది? దాదాపు పది రోజులుగా టీకాల కొరత ఉందన్న ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన

-మిగతా 3 లో

రేవంత్ పాలనకు మరో ఏడాదే!

ఆ తర్వాత తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకపాత్ర పోషిస్తారు
- కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ శక్తులు
- రాష్ట్రంలో దోపిడీ పాలన సాగుతోందని కేటీఆర్ విమర్శ
- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ
- స్థానిక ఎన్నికలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని వ్యాఖ్య
- ఎన్నికలు జరిగితే కార్పొరేషన్లలో బీఆర్ఎస్ విజయమని ధీమా
- అంబర్‌పేట బీఆర్ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన మరో ఏడాది మాత్రమే కొనసాగుతుందని, ఆ తర్వాత కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దోపిడీ పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. దేశ రాజకీయాల్లోనూ త్వరలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయని, కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలు బలపడతాయని అభిప్రాయపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

-మిగతా 2 లో

వార్తసంధ్య
www.vaarthasandhya.com

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య
రహస్య ఒప్పందం!

(మొదటి తరువాయి)

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని ఆయన విమర్శించారు. బీజేపీతో ఆ పార్టీకి ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తామని గతంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం ఉందన్నవి కాంగ్రెస్ నేత చేసిన రాజకీయ ఆరోపణలు కాగా, దీనిపై సంబంధిత పార్టీల స్పందన ఈ ప్రకటనలో ప్రస్తావించలేదు.

పాక్ సైనికులకు అంత్యక్రియలు చేసింది మేమే!

(మొదటి తరువాయి)

ఉగ్రవాదుల హక్కులపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నివేదికలో ఉగ్రవాద బాధితుల హక్కులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడాన్ని భారత్ తప్పుబట్టింది. జమ్మూకశ్మీర్‌లో భద్రతా చర్యల్లో మరణించిన వారి మృతదేహాలను కుటుంబాలకు అప్పగించకుండా మారుమూల ప్రాంతాల్లో రహస్యంగా ఖననం చేస్తున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని మత స్వేచ్ఛ, విశ్వాసాలపై ఐరాస ప్రత్యేక నివేదికకర్త నజీలా ఘనియా తన మధ్యంతర నివేదికలో పేర్కొన్నారు. ఈ చర్యలు ప్రధానంగా ముస్లింలను ప్రభావితం చేస్తున్నాయని, వారి మత సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నివేదికపై గురువారం జరిగిన చర్చలో ఐరాసలో భారత శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి భావిక మంగళానందన్ స్పందించారు. కార్గిల్ యుద్ధంలో తమ సైనికుల ప్రమేయాన్ని పాకిస్థాన్ అంగీకరించకపోయినా, భారత సైన్యం మానవతా దృక్పథంతో వారి మృతదేహాలకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించిందని తెలిపారు. మత విశ్వాసాలను గౌరవించడంలో భారత్ తన బాధ్యతను నిర్వర్తించిందని స్పష్టం చేశారు. ఉగ్రవాద బాధితుల హక్కులను కూడా సమానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐరాస వేదికగా భారత్ స్పష్టం చేసింది.

రేవంత్ పాలనకు మరో ఏడాదే!

(మొదటి తరువాయి)

ఈ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. దేశాన్ని బీజేపీ సంక్షోభంలోకి నెడుతోందని, మరోవైపు కాంగ్రెస్ ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండాను అందించలేకపోతోందని కేటీఆర్ విమర్శించారు. ప్రధాని మోదీ పాలనతో పాటు రాహుల్‌గాంధీ రాజకీయ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ గతంలో చెప్పిన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకపాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ అన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని, ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తప్పదని వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్ సాధించిన విజయాలను పునరావృతం చేస్తామని, కార్పొరేషన్లలో పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని, పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

అరెస్టులతో మా ఉద్యమాన్ని ఆపలేరు!

- జైలులో ఉన్నా.. బయట ఉన్నా పోరాటం కొనసాగుతుంది
- సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టీకరణ
- ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ విచారణకు హాజరైన ఇద్దరు నేతలు
- జంతర్‌మంతర్ ఆందోళనపై మరో కేసులో పోలీసుల నోటీసులు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గబోమని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ

తమను అరెస్టు చేసినంత మాత్రాన సీజేపీ చేపట్టిన ఉద్యమం ఆగిపోదని ఆ పార్టీ అగ్రనేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టం చేశారు. పార్టీ నాయకులు జైలులో ఉన్నా, బయట ఉన్నా ప్రజల తరఫున పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. అక్టోబర్ 13న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు జారీ చేసిన సమన్ల మేరకు శుక్రవారం ఇద్దరు నేతలు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అరెస్టులతో తమ ఉద్యమాన్ని అణచివేయలేరని పేర్కొన్నారు. తాము నాయకులం కాదని, దేశ ప్రజలు తమకు అప్పగించిన వ్యవస్థకు సంరక్షకులం మాత్రమేనని రాంకా, దాస్ వ్యాఖ్యానించారు. తమకు చేతనైనంత మంచి చేయాలన్నదే లక్ష్యమని చెప్పారు. అరెస్టుల కారణంగా వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. నాయకులను అరెస్టు చేస్తే ఉద్యమం ఎలా కొనసాగుతుందని మీడియా ప్రశ్నించగా, వ్యక్తులను నిర్బంధించినా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 13న సీజేపీ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలతో రాంకా, దాస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో వారం రోజులకు పైగా తిహార్ జైలులో ఉన్నారు. గత బుధవారం కోర్టు బెయిల్ మంజూరు చేయగా, అదే రోజు మరో కేసులో ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఇద్దరూ విచారణకు హాజరయ్యారు. తమపై కేసులు నమోదైనా ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

రాహుల్ గాంధీ వర్సెస్ ప్రియాంకా గాంధీ..

న్యూఢిల్లీ

కాంగ్రెస్ పార్టీలో అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ మధ్య విబేధాలున్నాయా..? బీజేపీ మాత్రం ఇది నిజమే అని ప్రచారం చేస్తోంది. ప్రియాంకా, రాహుల్ మధ్య అంతర్గత విబేధాలు చోటు చేసుకున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మేరకు బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి ఈ అంశంపై కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. ఇటీవల ప్రియాంకా గాంధీ తనయుడు, రాహుల్ గాంధీ మేనల్లుడు రైహాన్ వాద్రా విజువల్ అర్టిస్ట్, ఫొటోగ్రాఫర్ అనే సంగతి తెలిసిందే.అతడి చిత్రాలతో ఢిల్లీలోని బికనీర్ హౌస్‌లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అయితే, ఈ ప్రదర్శనలో ఉంచిన 105 చిత్రాలలో 74 ఫోటోలను ఎగ్జిబిషన్ నిర్వాహకులు తొలగించారు. వాటిలో యువత నిరసనలు, రాజకీయ అంశాలకు సంబంధించినవి ఉన్నాయని, అందువల్లే వాటిని తొలగించామని నిర్వాహకులు వివరణ ఇచ్చారు. దీనిపై రైహాన్ తల్లి ప్రియాంక గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఇది అప్రకటిత సెన్సార్‌షిప్ అని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ వివాదం రాజకీయ అంశంగా మారింది. ఇంత వివాదం జరిగినా ఈ అంశంపై రాహుల్ గాంధీ ఒక్క ట్వీట్ కూడా వేయలేదు.

సమన్వయంతోనే నేరాల కట్టడి

(మొదటి తరువాయి)

పాటు డీజీపీల సమావేశాన్ని సీఎం ప్రారంభించి మాట్లాడారు. పోలీసు వ్యవస్థపై చేసే ఖర్చును సమాజ భద్రత, మెరుగైన భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడిగా భావించాలని అన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న సాంకేతిక మౌలిక సదుపాయాలను పొరుగు రాష్ట్రాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, వామపక్ష తీవ్రవాద హింసను అరికట్టడంలో తెలంగాణ పోలీసులు విశేష ఫలితాలు సాధిస్తున్నారని సీఎం తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు హైదరాబాద్ పోలీసు వ్యవస్థను హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లుగా విభజించామని వివరించారు. నేరాల స్వభావానికి అనుగుణంగా హైడ్రా, ఈగల్, టీజీసీబీ, టీజీ టీమార్ఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగం పనితీరుకు కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా మార్కులు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన సొమ్మును తిరిగి అందించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడంతో పాటు ఔషధాల నియంత్రణను బలోపేతం చేసేందుకు అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో టీజీసీఎఫ్ విభాగాన్ని ప్రారంభించామని తెలిపారు. చెరువులు, జలవనరుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ, ప్రజా ఆస్తుల రక్షణలో హైడ్రా కీలకంగా పనిచేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు హోదా, సర్వీసు ఆధారంగా రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు పరిహారం అందిస్తున్నామని వెల్లడించారు. ఇంటి స్థలంతో పాటు అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎంఏ సలీమ్, తమిళనాడు డీజీపీ మహేష్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలిని సింగ్, లక్షద్వీప్ ఏడీజీ బి.శంకర్ జైస్వాల్, కేరళ ఐజీ అజీతా బేగం, ఆంధ్రప్రదేశ్ ఐజీపీ రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 31లోగా కరువు మండలాల ప్రకటన!

(మొదటి తరువాయి)

అధ్యక్షతన జరిగిన కేబినెట్ ఉపసంఘం తొలి సమావేశంలో కరువు నివారణ, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా, ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు 20 శాతానికి మించి ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, నిబంధనల ప్రకారం సిఫార్సులు సిద్ధం చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. అత్యవసర అవసరాలకు ఆర్థిక శాఖ నిధులు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుత నీటి ఎద్దడి నేపథ్యంలో వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి వారం సమీక్షలు నిర్వహించి కరువు నివారణ చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. భూగర్భ జలమట్టాలు, వేసవి తీవ్రతకు సంబంధించిన వివరాలను క్రమం తప్పకుండా వెల్లడించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నీటి సంరక్షణ, వ్యవసాయ సలహాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.7 వేల కోట్లతో కరువు నివారణ పనులు చేపడుతున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమివ్వాలని, కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులకు అత్యవసర నిధులు అందుబాటులో ఉంచాలని సూచించారు. చెరువుల్లో నీరు తగ్గుతున్న నేపథ్యంలో చేపల సంరక్షణకు చర్యలు చేపడుతున్నామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశువుల కోసం గ్రామాల్లో నీటితొట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 358 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. తక్కువ వర్షపాతం, సాగు విస్తీర్ణం 50 శాతం కంటే తక్కువగా ఉండటం వంటి ప్రమాణాల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 31లోగా కరువు మండలాల జాబితాను కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉండగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. 324 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకరంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర జలాశయాల్లో మొత్తం 470 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 170 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. సింగూరు జలాశయంలో నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద రూ.కోటి విడుదల చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత్-చైనా సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తతలు

-చైనా పెట్రోలింగ్ తీరుపై భారత్ ఆందోళన
-అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ముఖాముఖి పరిస్థితులు
-సరిహద్దులో శాంతి తప్పనిసరన్న విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ:
భారత్-చైనా సరిహద్దులో మరోసారి ఉద్రిక్తతలు తెరపైకి వచ్చాయి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి చైనా సైనికులు గతంలో అనుసరిస్తున్న పెట్రోలింగ్ విధానాలకు భిన్నంగా వ్యవహరించడం వల్ల అప్పుడప్పుడు పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత నెలకొనడం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి అత్యంత కీలకమని పేర్కొంది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో పలు ప్రాంతాల్లో చైనా సైనికులతో భారత దళాలకు ఎదురెదురుగా తలపడే పరిస్థితులు కొనసాగుతున్నాయని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ వెల్లడించిన నేపథ్యంలో కేంద్రం స్పందించింది. చైనా బలగాలు గతంలో ఇరు పక్షాల మధ్య ఉన్న పెట్రోలింగ్ విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పుడు సరిహద్దు పరిస్థితులు ఎప్పటికప్పుడు ప్రభావితమవుతున్నాయని జైస్వాల్ తెలిపారు. ఎల్ఏసీ వెంబడి నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, అపార్థాలు మరియు తప్పుడు అంచనాలను నివారించేందుకు ఇరు దేశాలు ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాల ద్వారా చర్చలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. సరిహద్దు నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు ఎల్ఏసీపై పరస్పర అవగాహన పెంచుకునే అంశాలను కూడా భారత్, చైనా చర్చించేందుకు అంగీకరించాయని ఆయన వెల్లడించారు. అయితే, అరుణాచల్ ప్రదేశ్‌లో చోటుచేసుకున్న తాజా ముఖాముఖి ఘటనలకు సంబంధించిన నిర్దిష్ట వివరాలపై స్పందించకుండా, ఆ అంశాలను రక్షణ మంత్రిత్వ శాఖను అడగాలని సూచించారు.

రంగంలోకి 'శౌర్య' కమాండోలు

మరోవైపు, అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)తో భారత దళాలకు ఎదురెదురుగా తలపడే పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయని ఐటీబీపీ చీఫ్ శత్రుజీత్ కపూర్ గురువారం వెల్లడించారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఐటీబీపీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ, ఆధునిక సాంకేతికత అవసరమని పేర్కొన్నారు. సరిహద్దు బెటాలియన్లలో డ్రోన్ విభాగాలను ఏర్పాటు చేసినట్లు, గాల్వాన్ లోయలో 2020లో జరిగిన ఘర్షణ తరహా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక స్ట్రైక్ శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. చైనా బలగాలతో కొనసాగుతున్న ముఖాముఖి పరిస్థితుల్లో శౌర్య కమాండోలు తమ సామర్థ్యాలను ప్రదర్శించారని కూడా ఆయన పేర్కొన్నారు. 2020లో గాల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనంతరం సరిహద్దు సమస్యల పరిష్కారం, సైనిక బలగాల ఉపసంహరణ, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ దిశగా ఇరు దేశాలు పలు చర్చలు చేపట్టాయి. 2024 అక్టోబర్‌లో తూర్పు లద్దాఖ్‌లోని దెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో సైనిక బలగాల ఉపసంహరణకు సంబంధించి ఇరు దేశాలు అవగాహనకు వచ్చాయి. అయినప్పటికీ, సరిహద్దులో అప్పుడప్పుడు తలెత్తుతున్న ఉద్రిక్తతలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్ఏసీ వెంబడి శాంతి, ప్రశాంతతను కాపాడుకోవడంతో పాటు దౌత్య, సైనిక చర్చలను కొనసాగించడం అత్యవసరమని భారత్ మరోసారి స్పష్టం చేసింది.

కివీస్‌తో రెండో సమరానికి భారత్ సిద్ధం!

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ పర్యటనను ఘన విజయంతో ప్రారంభించిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా శనివారం క్రైస్ట్‌చర్చ్ వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టీ20 జరగనుంది. తొలి మ్యాచ్‌లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి రికార్డు విజయాన్ని అందుకున్న శ్రేయస్ అయ్యర్ సేన అదే జోరును కొనసాగించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలని ఆతిథ్య న్యూజిలాండ్ భావిస్తోంది. తొలి టీ20లో భారత బౌలర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించారు. సంజూ శాంసన్ 67 పరుగులతో శుభారంభం అందించగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 42 పరుగులతో ఆకట్టుకున్నాడు. చివర్లో నమన్ ధీర్ కేవలం 15 బంతుల్లో అజేయంగా 42 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. అయితే రెండో టీ20కి ముందు భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తొడ కండరాల గాయంతో మ్యాచ్‌కు దూరమైనట్లు బీసీసీఐ వెల్లడించింది. అతడి స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. వైభవ్ తుది జట్టులోకి వస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశముంది. దీంతో సంజూ శాంసన్ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగవచ్చు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మతో పాటు ఆల్‌రౌండర్లు నమన్ ధీర్, అక్షర్ పటేల్‌పైనా జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. తొలి మ్యాచ్‌లో ధాటిగా ఆడిన నమన్ ధీర్ మరోసారి కీలకంగా మారనున్నాడు. బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్ మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. తొలి మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న బౌలర్లు ఈసారి పుంజుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు న్యూజిలాండ్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో లోపాలను సరిదిద్దుకుని బరిలోకి దిగనుంది. మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభం కానుంది.

భారత్ అంచనా తుది జట్టు: అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్.

న్యూజిలాండ్ అంచనా తుది జట్టు: ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, జాకబ్స్, బ్రాస్‌వెల్, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), నాథన్ స్మిత్, మాట్ హెన్రీ, మిల్నే, లోకీ ఫెర్గ్యూసన్

ఏఐతో మానవాళి మనుగడకు ముప్పు!

- పదేళ్లలో వినాశనానికి 33 శాతం అవకాశమంటూ హెచ్చరిక
- గూగుల్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ సంచలన వ్యాఖ్యలు
- మానవ నియంత్రణ దాటితే తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన
- భద్రతా ప్రమాణాలను విస్మరిస్తున్న టెక్ కంపెనీలపై విమర్శలు

న్యూఢిల్లీ

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత భవిష్యత్తులో మానవాళి మనుగడకే ముప్పుగా మారే ప్రమాదముందని గూగుల్ డీప్‌మైండ్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ హెచ్చరించారు. రాబోయే పదేళ్లలో ఏఐ కారణంగా మానవాళి అంతమయ్యే అవకాశం 33 శాతం ఉందని ఆయన అంచనా వేశారు. శుక్రవారం ఢిల్లీలో మాట్లాడుతూ మానవుల ఆదేశాలు లేకుండానే ఏఐ వ్యవస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకుంటే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏఐ అభివృద్ధిపై తీసుకునే నిర్ణయాలు, అమలు చేసే భద్రతా చర్యలపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో పోటీ కారణంగా ప్రముఖ కంపెనీలు ఏఐ భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని టర్నర్ ఆరోపించారు. ఆధునిక ఏఐ వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయో, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాయో వాటిని రూపొందించిన శాస్త్రవేత్తలు కూడా పూర్తిస్థాయిలో అర్థం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. ఒక ఏఐ వ్యవస్థను పర్యవేక్షించేందుకు మరో ఏఐని ఉపయోగించడం సరైన భద్రతా చర్య కాదన్నారు. ఏఐ లక్ష్యాలను మానవ ప్రయోజనాలకు అనుగుణంగా నియంత్రించే వ్యవస్థలు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదని చెప్పారు. గతంలో పొగాకు, చమురు కంపెనీలు తమ ఉత్పత్తుల వల్ల కలిగే ప్రమాదాలను దాచినట్లే ప్రస్తుతం కొన్ని ఏఐ కంపెనీలు కూడా ముప్పును తక్కువ చేసి చూపుతున్నాయని టర్నర్ విమర్శించారు. ఏఐ ప్రమాదాలపై హెచ్చరికలను తప్పుదోవ పట్టించే ప్రచారంగా చిత్రీకరిస్తున్నాయని ఆరోపించారు. అమెరికా రక్షణ శాఖతో గూగుల్ ఒప్పందం, సైనిక అవసరాలకు ఏఐ వినియోగంలో భద్రతా ప్రమాణాలపై అభ్యంతరాలతోనే తాను డీప్‌మైండ్ నుంచి బయటకు వచ్చినట్లు వెల్లడించారు. ఏఐ అభివృద్ధితో పాటు మానవ నియంత్రణ, భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

దమ్మాయిగూడకు చెందిన యువతి అదృశ్యం

-వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు చివరిసారిగా ఫోన్..

- జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

జవహర్‌నగర్, అక్టోబర్ 23 (వార్త సంధ్య): మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ పరిధిలోని మారుతి నగర్‌కు చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటనపై జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తప్పిపోయిన యువతి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆసుపత్రి నుంచి వెళ్లిన అనంతరం కనిపించకుండా..

పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. మారుతి నగర్‌కు చెందిన కుమారి ఐల జయశ్రీ బాలాజీనగర్‌లోని మీనాక్షి ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. అక్టోబర్ 18న విధుల కారణంగా ఇంటి వద్దే ఉండగా, ఆమె కుటుంబ సభ్యులు స్వగ్రామానికి వెళ్లారు. అక్టోబర్ 20న జయశ్రీకి ఫోన్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఆమెతో మాట్లాడటం సాధ్యపడలేదు. ఆసుపత్రి యాజమాన్యాన్ని విచారించగా, విధులు ముగించుకుని స్నేహితురాలి వివాహానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లినట్లు తెలిసింది.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం

అక్టోబర్ 21న జయశ్రీ తన మేనత్త అనిశెట్టి నాగరాణికి ఫోన్ చేసి, తాను వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తర్వాత ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యులు సంప్రదించలేకపోయారు. బంధువులు, తెలిసినవారి వద్ద విచారించినప్పటికీ ఆచూకీ లభించలేదు.

వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేసిన ఫిర్యాదుదారు

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం రామనగరం కాలనీకి చెందిన శ్రీధర్ అనే వ్యక్తితో కలిసి జయశ్రీ వెళ్లి ఉండవచ్చని ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు అక్టోబర్ 23న ఉదయం 11.15 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు ఆధారంగా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1486/2026 కింద మహిళ అదృశ్యమైన కేసు నమోదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ బి. రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆచూకీ గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

అన్వేషణ

తల్లి జన్మనిచ్చినప్పుడు కేవలం ఒక ప్రాణం పుడుతుంది
ఎప్పుడైతే బ్రతుకు మనకు కష్టాలను ఇస్తుందో
అప్పుడు ఒక జీవితం పుడుతుంది
ఆ కష్టాలన్నీ ఎదుర్కొని నిలిచినప్పుడు
ఒక కథ పుడుతుంది
నీకు కావలసిన కథ నీ జీవితంలోనే ఉంది
వెతుకు..... నీకే దొరుకుతుంది
కొన్ని కథలు జీవితాలుగా మారుతాయి
కొన్ని జీవితాలే కథలు గా మారతాయి
నిట్టల. సీతారామ్

నేడు ఎంపీటీసీ

నామినేషన్ల పరిశీలన

- 96 నామినేషన్ పత్రాలపై అధికారుల దృష్టి

- ఉదయం 8 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభం

చిట్వేలి, అక్టోబర్ 23 (వార్త సంధ్య): రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్వేలు మండల పరిషత్ ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలనకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు స్వీకరించిన మొత్తం 96 నామినేషన్ పత్రాలను శనివారం పరిశీలించనున్నారు. చిట్వేలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉదయం 8 గంటలకు పరిశీలన ప్రక్రియ ప్రారంభమవుతుందని రిటర్నింగ్ అధికారి జి. జయభరత్ రెడ్డి వెల్లడించారు. ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు నిర్ణీత సమయానికి కార్యాలయానికి హాజరుకావాలని ఆయన సూచించారు. నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం అభ్యర్థుల అర్హత, పత్రాల వివరాల ఆధారంగా తదుపరి ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది.

బాపూజీ ఉద్యమ వారసుడికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి!

-గవర్నర్ కోటాలో దాసు సురేష్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

-చేనేత పద్మశాలి, బీసీ సామాజిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 23.
ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధన కోసం నిరంతరం పోరాడుతూ, చేనేత పద్మశాలీల హక్కులు, బీసీల రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని చేనేత పద్మశాలి, బీసీ సామాజిక సంఘాల నాయకులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. బీసీల గొంతుకగా, చేనేత సమాజం హక్కుల సాధకుడిగా ప్రజాక్షేత్రంలో పోరాడుతున్న ఆయన సేవలను గుర్తించి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేనేత పద్మశాలి, బీసీ సామాజిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షుడు దొంత ఆనందం అధ్యక్షత వహించగా, పోషాల సరస్వతి, చిక్కా దేవదాస్ సంయుక్తంగా నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

చేనేత కార్మికుల హక్కుల కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం

ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు బొమ్మ నరేందర్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల కష్టనష్టాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వారి సమస్యల పరిష్కారం కోసం దాసు సురేష్ నిరంతరం ఉద్యమించారని తెలిపారు. చేనేత కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలనే డిమాండ్‌పై గత ప్రభుత్వంపై సుదీర్ఘకాలం ఒత్తిడి తీసుకొచ్చి, ఆ హక్కు సాధనకు కీలకంగా కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడిగా ఆయనకు తగిన గుర్తింపు లభించాల్సిన అవసరం ఉందన్నారు.

బాధిత చేనేత కుటుంబాలకు అండగా నిలిచిన నాయకుడు

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి మాట్లాడుతూ, ఆత్మహత్యలకు పాల్పడిన చేనేత కార్మికుల కుటుంబాలకు దాసు సురేష్ ఆర్థికంగా, నైతికంగా అండగా నిలిచారని చెప్పారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారితో కలిసి ఢిల్లీలో సైతం పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. పదవుల కోసం కాకుండా, ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పనిచేసే ఇలాంటి నాయకులకు చట్టసభల్లో అవకాశం కల్పించడం ద్వారా బీసీల సమస్యలకు బలమైన గొంతుక లభిస్తుందని అన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల ఉద్యమంలో కీలక పాత్ర

సీనియర్ జర్నలిస్టు తులసి శ్రీమాన్ మాట్లాడుతూ, సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా దాసు సురేష్ తన ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో సాగిన ఉద్యమంలో, అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన అనంతరం ఏర్పడిన తెలంగాణ బీసీ జేఏసీకి కో-చైర్మన్‌గా నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యమే సామాజిక న్యాయానికి పునాది

చేనేత పద్మశాలి సమాజంతో పాటు రాష్ట్రంలోని విస్తృత బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం కోసం దాసు సురేష్ చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. బీసీ ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ, అట్టడుగు వర్గాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్న నాయకుడికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడం కాలానుగుణమైన అవసరమని స్పష్టం చేశారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు గౌరవం ఇవ్వడంతో పాటు, చేనేత పద్మశాలీలు, బీసీ వర్గాల ఆకాంక్షలకు తగిన ప్రాధాన్యతనిస్తూ దాసు సురేష్‌కు గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నాయకులు కోరారు. 'బాపూజీ ఉద్యమ వారసత్వానికి గుర్తింపు ఇవ్వాలి.. బీసీలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి.. చేనేత, బీసీ హక్కుల కోసం పోరాడుతున్న దాసు సురేష్‌కు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి" అంటూ నాయకులు ముక్తకంఠంతో నినదించారు. ఈ సమావేశంలో అల్లంపల్లి రామకోటి, తులసి శ్రీమాన్, బోరా సుభాష్ చంద్రబోస్, పెండెం ధనుంజయ, బోనం ఊర్మిళ, సాజిదా సికిందర్, ఊరుగొండ శివ, ప్యారసాని దుర్గేశ్, మంద వెంకటస్వామి, ఏలే బాలకృష్ణ, మంద ఈశ్వర్, పాక శ్రీనివాస్, తలకొక్కుల శ్రీశైలం తదితర నాయకులు పాల్గొన్నారు.

పసి ప్రాణాలతో చెలగాటమా?

అవసరం ఉంది. వ్యాక్సిన్ల సరఫరాలో సమస్యలున్నాయా? నిల్వలు ఎందుకు తగ్గాయి? సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదు? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలి.

టీకాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులకు ముందుగానే సమాచారం ఇవ్వాలి. ఏ కేంద్రంలో టీకాలు లభిస్తున్నాయి? వాయిదా పడిన టీకాను ఎప్పుడు వేయించుకోవాలి? అనే వివరాలను వైద్య సిబ్బంది తెలియజేయాలి. టీకాల విషయంలో అనవసర జాప్యం జరగకుండా వైద్యులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. అయితే, వికారాబాద్ జిల్లాలో నిజంగా ఎంతమేర టీకాల కొరత ఉంది, ఏయే కేంద్రాల్లో సేవలకు అంతరాయం ఏర్పడింది అనే అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఉద్యోగుల ధర్నా.. ప్రజలకు తప్పని తిప్పలు!

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల ఆందోళనతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోందన్న విమర్శలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో చిన్నారుల టీకాలు, గర్భిణులకు అందించాల్సిన సేవలు, అత్యవసర వైద్యం నిలిచిపోకుండా చూడటం కూడా అధికారుల బాధ్యతే. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే దాని ప్రభావం చివరకు సామాన్య ప్రజలపై పడుతుంది.

ఉద్యోగుల ఆందోళనకు దారితీసిన కారణాలేమిటి?

ప్రభుత్వం వారి సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగించేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు? అనే అంశాలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలి. సిబ్బంది సమస్యలు ఒకవైపు, ప్రజారోగ్య అవసరాలు మరోవైపు ఉన్నప్పుడు రెండింటినీ సమన్వయం చేయడంలో వైద్యశాఖ యంత్రాంగం విఫలమైందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గూగుల్‌లో తప్పు నంబర్లు.. ప్రభుత్వ వెబ్‌సైట్లలోనూ గందరగోళమేనా?

వైద్య ఆరోగ్యశాఖ అధికారులను సంప్రదించాలనుకునే ప్రజలకు సరైన ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు మరో సమస్యగా మారుతున్నాయి. గూగుల్‌లో కనిపించే సంప్రదింపు వివరాలు, ప్రభుత్వ వెబ్‌సైట్లలో ప్రచురించిన అధికారుల ఫోన్ నంబర్లలో తప్పులున్నాయని ప్రజలు చెబుతున్నారు. కొన్ని నంబర్లకు ఫోన్ చేసినా స్పందన ఉండటం లేదన్న ఫిర్యాదులూ వినిపిస్తున్నాయి.

వ్యాక్సిన్ల లభ్యత తెలుసుకోవాలన్నా, వైద్య సేవలపై ఫిర్యాదు చేయాలన్నా, సంబంధిత అధికారులను సంప్రదించాలన్నా ప్రజలకు సరైన సమాచారం అవసరం. వెబ్‌సైట్లలో ఫోన్ నంబర్లు ప్రచురించడం మాత్రమే సరిపోదు. అవి పనిచేస్తున్నాయా? బదిలీల తర్వాత వివరాలను నవీకరిస్తున్నారా? ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులు స్పందిస్తున్నారా? అనే అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి. డిజిటల్ పాలన గురించి గొప్పగా చెప్పుకునే ప్రభుత్వ వ్యవస్థలో ప్రజలకు ఉపయోగపడే సంప్రదింపు వివరాలు కూడా సక్రమంగా లేకపోతే ఆ వ్యవస్థ ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

మంత్రి ఉన్నా.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎక్కడ?

వైద్య ఆరోగ్యశాఖకు మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు ఉన్నారు. అయినప్పటికీ ప్రజలకు అవసరమైన వైద్య సేవల విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయన్న ఆరోపణలు రావడం ఆందోళనకరం. వ్యాక్సిన్ల సరఫరా, ఉద్యోగుల సమస్యలు, అధికారుల సంప్రదింపు వివరాల్లో లోపాలు ఒకేసారి వెలుగులోకి వస్తే వాటిని సాధారణ సమస్యలుగా కొట్టిపారేయలేం. క్షేత్రస్థాయి పరిస్థితులపై ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారా? ప్రజల ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నారా? జిల్లాల్లో వ్యాక్సిన్ల నిల్వలు, సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర సమీక్ష జరగాలి. ప్రజారోగ్యానికి సంబంధించిన సమస్యలపై అధికారుల జవాబుదారీతనం స్పష్టంగా ఉండాలి.

తక్షణ చర్యలు తీసుకుంటారా?

వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వ్యాక్సిన్ల నిల్వలు, సరఫరా పరిస్థితిపై వాస్తవాలను వెల్లడించాలి. టీకాలు అందుబాటులో లేని కేంద్రాలు ఉంటే వాటి వివరాలను తెలియజేసి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. వాయిదా పడిన టీకాలను తిరిగి అందించేందుకు కార్యాచరణ ప్రకటించాలి. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూనే ప్రజారోగ్య సేవలు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.

గూగుల్‌తో పాటు ప్రభుత్వ వెబ్‌సైట్లలో ప్రచురించిన అధికారుల సంప్రదింపు వివరాలను పరిశీలించి, తప్పులను సరిచేయాలి. ప్రజల ఫోన్ కాల్స్‌కు స్పందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. చిన్నారుల ఆరోగ్యం ప్రభుత్వానికి ప్రాధాన్యమా? లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా? వికారాబాద్ జిల్లాలో టీకాల సరఫరా, వైద్య సేవలపై వస్తున్న ఆరోపణలకు అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలి. పసిపిల్లల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదు. సమస్యలు నిజమైతే తక్షణమే పరిష్కరించి, ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

ఎంపీ వద్దిరాజు మల్లవరం బామ్మ కల నెరవేర్చారు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 23. :
ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరంకు చెందిన 96 సంవత్సరాల బామ్మ దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నెరవేర్చారు.మల్లవరం గ్రామ సర్పంచ్ గా 2సార్లు, ఎంపీటీసీగా 2 పర్యాయాలు, సింగిల్ విండో డైరెక్టర్ గా పని చేసిన సామ్రాజ్యం అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలకు పాత్రులయ్యారు.అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిపెట్టి అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అంటే సామ్రాజ్యంకు ఎనలేని అభిమానం.మహానేత కేసీఆర్ ను కలిసి ఫోటో దిగాలనేది ఆమె చిరకాల కోరిక.ఈ విషయాన్ని ఆమె పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకురాగా,ఆయన సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా సామ్రాజ్యంను ఆమె కుమారులు వెంకటలాల్,అజయ్ కుమార్,మనవళ్లు యుధిష్టర్,శ్రీరఘునందన్ లను వెంటబెట్టుకుని రవిచంద్ర శుక్రవారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు వద్దకు తీసుకెళ్లారు.సామ్రాజ్యంను కేటీఆర్ ఆప్యాయంగా పలకరించి శాలువాతో సత్కరించి గౌరవించారు,త్వరలో కేసీఆర్ వద్దకు తీసుకెళ్లి ఆమె చిరకాల కోరికను నెరవేర్చుతానని మాటిచ్చారు.

శ్రీరఘునందన్ ను అభినందించిన కేటీఆర్
సామ్రాజ్యం మనవడు,అజయ్ కుమార్ కుమారుడు శ్రీరఘునందన్ బెంగళూరులో బీబీఏ చదువుతున్నారు.ఆయనకు చిన్నతనం నుంచే సమాజ సేవ,పరిశుభ్రత,పచ్చదనం పట్ల మక్కువ ఎక్కువ.మహానేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా 2016 ఫిబ్రవరి 17వతేదీన తమ స్వగ్రామం మల్లవరంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన దత్తత తీసుకున్నారు.అప్పుడాయన 5వ తరగతి చదువుతున్నారు,వయస్సు 9 ఏళ్లు.తాను దత్తత తీసుకున్న ప్రాథమిక పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాక పరిసరాలలో పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంచారు.చిన్నతనంలోనే శ్రీరఘునందన్ చేస్తున్న సమాజసేవను అభినందిస్తూ 2017లో జాతీయ,2017,18లలో రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు లభించాయి.ఈ సందర్భంగా శ్రీరఘునందన్,ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్, రవిచంద్రలు అభినందించారు.

అపరిశుభ్రతకు నిలయంగా ఫైల్ తండా.. పట్టించుకోని అధికారులు!

-చెత్తకుప్పలతో దుర్గంధం.. సీజనల్ వ్యాధులపై తండావాసుల ఆందోళన
-పారిశుధ్య పనులు చేపట్టకుంటే ఆందోళన తప్పదు: స్థానికుల హెచ్చరిక

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 23 (వార్త సంధ్య):
సింగరేణి మండల పరిధిలోని ఫైల్ తండాలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాలోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చెత్తకుప్పల కారణంగా ఈగలు, దోమలు పెరిగిపోతున్నాయని, దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాల్సిన పంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు విమర్శిస్తున్నారు. పరిశుభ్రతపై పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, డ్రైనేజీలను శుభ్రపరిచి, తండాలో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు స్పందించి ఫైల్ తండాలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

రాంనగర్ కాలనీలో నూతన బోర్ మోటార్ ప్రారంభం

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23వార్త సంధ్య
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు రాంనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌ను షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. కాలనీవాసులకు నీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు మున్సిపల్ పాలకవర్గం కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కాలనీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వాణిశ్రీ పాండు రంగారెడ్డి, మున్సిపల్ ఏఈ నరేష్, సాయికిరణ్, ఇలియాస్, బాలాజీ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి షాపులు.. సింగరేణి మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ తిప్పలు!

-డ్రైనేజీలు దాటి రహదారిపైకి దుకాణాల విస్తరణ
-నోటీసులు ఇచ్చినా మారని వ్యాపారుల తీరు.. చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 23 (వార్త సంధ్య):
సింగరేణి మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ప్రధాన రహదారిపై ఉన్న కొందరు వ్యాపారులు డ్రైనేజీ కాల్వలను దాటి దుకాణాల సామగ్రిని రోడ్డుపైకి విస్తరించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులు ఇచ్చినా మారని పరిస్థితి
రహదారి ఆక్రమణలను తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ, గ్రామ పంచాయతీ సిబ్బంది పలుమార్లు హెచ్చరికలు జారీ చేసి నోటీసులు అందించినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు నోటీసులు ఇచ్చిన సమయంలో కొంతమేర వెనక్కి తగ్గుతున్న వ్యాపారులు, ఆ తర్వాత మళ్లీ యథావిధిగా దుకాణాల సామగ్రిని రోడ్డుపైకి తీసుకొస్తున్నారని ఆరోపిస్తున్నారు.

వాహనదారులకు తప్పని ఇబ్బందులు
దుకాణాల ముందు వినియోగదారులు తమ వాహనాలను రహదారిపైనే నిలిపివేయడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారుతోంది. ఆటోలు, కార్లు, భారీ టిప్పర్లు, లారీలు ఒకేసారి ఎదురెదురుగా వచ్చినప్పుడు ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలు స్తంభించడంతో అత్యవసర ప్రయాణాలు చేసే వారికీ ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు.

గాంధీ విగ్రహం సెంటర్ వద్దా అవస్థలే!
గాంధీ విగ్రహం సెంటర్ సమీపంలో రహదారి పక్కన వాహనాల నిలుపుదలతో పాదచారులు నడవడానికి కూడా తగిన స్థలం లేకుండా పోతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల మధ్య నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు.

ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి
కేవలం నోటీసులు జారీ చేయడంతో సరిపెట్టకుండా, నిబంధనలు ఉల్లంఘిస్తూ రహదారులను ఆక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ, సంబంధిత రహదారి నిర్వహణ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శాశ్వత పరిష్కారం చూపాలని సింగరేణి మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పండుగ సాయన్నకు ప్రభుత్వ గుర్తింపు హర్షణీయం

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 23
తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి సంస్థ గుర్తింపునిస్తూ పూజ వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174 జయంతి వేడుకలను అధికారం గా అధికారికంగా నిర్వహించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వానికి పండుగ సాయన్న ఉత్సవ కమిటీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కమిటీ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు అక్టోబర్ 22న హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగసాయంతి జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొనడం ముదిరాజ్ సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు కార్యక్రమం ద్వారా పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి కి త్యాగాలకు సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి తగిన గుర్తింపు లభించిందని తెలిపారు ముదిరాజ్ సామాజిక సమాజం అభ్యున్నతికి సీఎం సానుకూలంగా స్పందన హర్షనీయమని బో ర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని కొడంగల్ నియోజకవర్గం లో ముదిరాజ్ సోదరులు తన ఎరుగుదలకు అందించిన సహకారాన్ని గుర్తు చేసుకోవడం తమ సమాజానికి ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించిందని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు ముదిరాజుల సామాజిక ఆర్థిక పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని వారి అభివృద్ధికి అవసరమైన చేపట్టారని ప్రభుత్వం వైఖరి అభినందనీయమని పేర్కొన్నారు ముదిరాజుల ప్రధాన డిమాండ్లు ప్రభుత్వానికి ముద్రాజ్ సమాజ అభ్యున్నతికి దృష్టిలో ఉంచుకొని గౌరవ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ పండుగ సాయన్న ఉత్సవ కమిటీ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్యమంత్రి పాలు కీలక అంశాలను తీసుకెళ్లారు ముదిరాజులను బిసి–డి నుంచి బీసీ ఏ గ్రూపులో అంశాన్ని పరిశీలించడం హైదరాబాద్ ముదిరాజ్ భవన నిర్మాణక అవసరమైన ప్రభుత్వ ఆర్థిక సాయం అందించడం ముదిరాజ్ యువతకు విద్య ఉద్యోగ ఆర్థిక రంగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించడం సామాజిక రాజకీయ రంగాల్లో ముదిరాజులకు తగిన ప్రాధాన్యత అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారుల నిర్వహించి ముదిరాజ్ సమాజా గౌరవాన్ని పెంపొందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ముదిరాజ్ సమాజ సమస్యలను ప్రభుత్వం దృష్టిలో తీసుకెళ్లడం కీలకంగా వ్యవహరించిన మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు ప్రభుత్వానికి మరోసారి ప్రతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ముదిరాజ్ సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ఉత్సవ కమిటీ సంపూర్ణ సహకారం అందిస్తుందని సామాజ హక్కులు సంక్షేమ అభ్యున్నతి కోసం ఐక్యంగా కృషి చేస్తామని బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర యువత నాయకులు జగన్ ముదిరాజ్, జనార్ధన్ ముదిరాజ్, పోశాల సరస్వతి, రోహిత్ ముదిరాజ్ తో పాటు పలువురు ముదిరాజ్ సంఘం నేతలు పాల్గొని ప్రసంగించారు

శక్తి నగర్‌లో మట్టి రోడ్డు నిర్మాణం

- 15 ఏళ్ల సమస్యకు తాత్కాలిక పరిష్కారం
- నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవతో రహదారి ప్రారంభం
- హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు

వార్త సంధ్య కూకట్‌పల్లి :
ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని శక్తి నగర్, వైట్ వాటర్ అపార్ట్‌మెంట్స్ వద్ద గత 15 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న రహదారి సమస్యకు ఎట్టకేలకు తాత్కాలిక పరిష్కారం లభించింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవతో ఈ రోడ్డు సమస్య కొలిక్కి వచ్చింది. గత వారం స్థానిక డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన, రహదారి నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగించేందుకు కృషి చేయడమే కాకుండా, తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించేందుకు తనవంతు పూర్తి సహకారాన్ని అందించారు.

ఈ క్రమంలో శుక్రవారం వడ్డేపల్లి రాజేశ్వరరావు డివిజన్ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి నూతనంగా నిర్మించిన మట్టి రోడ్డును లాంఛనంగా ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్న తమకు ఈ రోడ్డు నిర్మాణంతో కొంత ఉపశమనం లభించిందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కాలనీ అభివృద్ధికి పాటుపడుతున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు కి అండగా ఉంటామని ప్రజలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... "ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం మనందరి బాధ్యత. గత 15 సంవత్సరాలుగా రహదారి సౌకర్యం లేక స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, కనీస రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతోనే అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా ఈ మట్టి రోడ్డును నిర్మించాం. శక్తి నగర్ కాలనీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుంటాం" అని తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణంలో శ్రమించిన డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి మరియు నాయకులను ఆయన అభినందించారు. రాబోయే రోజుల్లో కూకట్‌పల్లిలో కాషాయ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు విజయ భవాని, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి కోడిచెర్ల వినోద్, సీనియర్ నాయకులు తూము శైలేష్, ఐలయ్య, జీవన్, శేఖర్ గుప్తా, పిట్ల మనోహర్, ఈ.సాయి, డివిజన్ నాయకులు రాజేందర్ గౌడ్ (బబ్లు), మనోజ్, శ్రీనివాస్ చారి, కృష్ణ యాదవ్, చక్రవర్తి, వంశీ నేత మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం

అభివృద్ధిని మరిచి అభాండాలా?

ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న 'వివేకులు' అబద్ధాలు వండి వడ్డించినంత మాత్రాన, వినేందుకు తెలంగాణ ప్రజలేమీ చెవిలో పూలు పెట్టుకున్న అవివేకులు కాదు. మీ పత్రికల్లో, మీ చానల్‌లో వస్తున్న వార్తా కథనాల వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలేంటో వారికి బాగా తెలుసు. ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో వేరు చేసి చూసే విజ్ఞత ప్రజలకు ఉన్నది.

'ఈ నెల 17న 'వెలుగు' దినపత్రిక, వీ6 న్యూస్ చానల్లలో 'కేసీఆర్ ఫామ్ హౌస్‌కు మళ్లిన కొండపోచమ్మ' అంటూ అసత్యాలతో వండివార్చిన పచ్చి అబద్ధపు, కుట్రపూరితమైన వార్తను తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నపుడే మన ప్రజల పొలాలు పండాలె, వాళ్ల గుండె నిండాలనే తపనతో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను బదనాం చేయాలని, కేసీఆర్ వ్యక్తిత్వాన్ని హననం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కంకణం కట్టుకున్నారు. ప్రజల్లో రోజురోజుకూ కేసీఆర్‌కు పెరుగుతున్న ఆదరణను తగ్గించాలనే ఒకే ఒక్క మూర్ఖపు ఆలోచనతోనే సీఎం రేవంత్‌రెడ్డి కండ్లల్లో ఆనందం చూడటానికే ఈ తప్పుడు స్టోరీని వండి ప్రజల్లోకి వదిలారని స్పష్టంగా అర్థమవుతున్నది. కాంగ్రెస్ నాయకులు తమకు నచ్చని పత్రికలను బురదజల్లడం అలవాటు చేసుకున్నారు. అందుకే వారి 'వెలుగు' పత్రిక, 'వీ6' చానల్ పూర్తిగా ఆ పార్టీకి అనుకూలంగా మారిపోయాయి. అవి ప్రజా పక్షం కాదు, రేవంత్ రెడ్డి పక్షంగా మారిన పక్షపాత పత్రిక, చానల్! రేవంత్ రెడ్డి ఏది మాట్లాడితే అది రాయడానికి, ఆయన భజన చేయడానికి మాత్రమే మీ ఆలోచనా విధానం పరిమితమైంది తప్ప..గతంలో మాదిరిగా ప్రజల కోణంలో వార్తలు రాయాలనే, ప్రజల మన్ననలు పొందాలనే కనీస విలువలు లేకుండా పోయాయి. మీకు నిజంగానే పత్రిక ప్రజల ప్రయోజనాల కోసమే అనే సోయి ఉంటే, పత్రికా స్వేచ్ఛ ఉంటే, ఈ రాష్ట్రంలో ఇవాళ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎందుకు నోరు విప్పడం లేదు? ఒక పక్క రైతాంగం తాము పండించిన పంటలు ఎండిపోతున్నాయని, కరెంటు కోతలతో అల్లాడిపోతున్నామని గగ్గోలు పెడుతూ రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే..ఆ వార్తలు మీ పత్రికలో గానీ, మీ చానల్‌లో గానీ ఎందుకు కనిపించడం లేదు? రైతుల కష్టాలు, ప్రభుత్వ వైఫల్యాలను డైవర్ట్ చేయడానికే కేసీఆర్‌పై ఈ అడ్డగోలు బురదజల్లే కార్యక్రమానికి తెరలేపారా? ఇవాళ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ముఖ్యమంత్రి బినామీకి సంబంధించిన మెడికవర్ ఆస్పత్రుల్లో సరైన వైద్యం చేయక అనేకమంది పేద ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారి బంధువులు రోడ్డెక్కి న్యాయం చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. ఈ హృదయ విదారకమైన వార్తలు మీ దాంట్లో ఎందుకు రావడం లేదు? వీటిని కవర్ చేయకపోవడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదని మీరు అనుకుంటున్నారా? మీరు రాసిన ఆ 58 ఎకరాల 'పాండురంగ చెరువు' కథనం వెనుక ఉన్న అసలు నిజం ఏమిటో మీకు తెలుసా? 15 టీఎంసీల భారీ సామర్థ్యంతో నిర్మించిన కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ద్వారా 5 జిల్లాలు, 10 నియోజకవర్గాల్లోని 2 లక్షల 85 వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. మెదక్, గజ్వేల్, దుబ్బాక, ఆలేరు, మల్కాజిగిరి ప్రాంతాల పరిధిలో సుమారు 170 కిలోమీటర్ల మేర 750 చెరువులను నింపేలా ఒక బృహత్తర ప్రణాళికను కేసీఆర్ ఆనాడే సిద్ధం చేశారు. అందులో భాగంగానే, 2015లోనే నాటి కేసీఆర్ ఎర్రవెల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ జిల్లా 'గంగాదేవిపల్లి' గ్రామం ఏ రకంగానైతే ఆదర్శంగా నిలిచిందో..అదే మాదిరిగా ఎర్రవెల్లిలో కూడా సామూహిక వ్యవసాయం జరగాలని, అందరికీ నీళ్లు అందాలని ఆనాడే సంకల్పించి ఆ చెరువును ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ జిల్లా 'గంగాదేవిపల్లి' గ్రామం ఏ రకంగానైతే ఆదర్శంగా నిలిచిందో.. అదే మాదిరిగా ఎర్రవెల్లిలో కూడా సామూహిక వ్యవసాయం జరగాలని, అందరికీ నీళ్లు అందాలని ఆనాడే సంకల్పించి ఆ చెరువును ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశారు. గతంలో ఆ ప్రాంతమంతా గుక్కెడు నీళ్లకు తల్లడిల్లిన డ్రై ఏరియా. పంటలు పండక, భూములన్నీ పడావు పడి ఉండేది. గతంలో ఆ ప్రాంతమంతా గుక్కెడు నీళ్లకు తల్లడిల్లిన డ్రై ఏరియా. పంటలు పండక, భూములన్నీ పడావు పడి ఉండేది. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి, కొండపోచమ్మ సాగర్ నిర్మించి, దాని కింద ఉన్న చెరువులను పునరుద్ధరించి, విస్తరించి ఆనాడు ప్రజలకు సాగునీరు అందించడానికి భగీరథ ప్రయత్నం చేస్తే..మీ మూర్ఖపు ఆలోచనలతో ఇవాళ దాన్ని కేసీఆర్ ఫామ్‌హౌస్ కోసమే కట్టారంటూ తప్పుదోవ పట్టించే కుట్రలు చేస్తున్నారు. అభివృద్ధి వెలుగులను చూడకుండా, కాంగ్రెస్‌కు అలవాటైన చీకటి వార్తలు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్న మీ యాజమాన్యంలోని పత్రికలో, మీ చానల్‌లో వస్తున్న వార్తా కథనాల వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలేమిటో ప్రజలకు బాగా తెలుసు. ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో వేరు చేసి చూసే విజ్ఞత ప్రజలకు ఉన్నది ఇప్పటికైనా మీరు అసత్యాలతో రాసిన ఆ వార్త తప్పుడు సమాచారంతో రాశామని అంగీకరిస్తూ మరో వార్త రాయాలి. దీంతోపాటుగా కేసీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇది 'అబద్ధపు కథనం' అని మీ పత్రికలోనే ప్రత్యేకంగా సవరణ వార్త ప్రచురించే వరకు మా న్యాయపోరాటం ఆగదు. మీపై ఇప్పటికే న్యాయపరంగా చర్యలు తీసుకోవడానికి, కోర్టులో కేసు వేయడానికి మా పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. ఇలాంటి అసత్యపు, అడ్డగోలు ప్రచారాలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తే భవిష్యత్తులో ఊరుకునే ప్రసక్తే లేదు. 420 హామీలను నమ్మి, కాంగ్రెస్‌ను గద్దెనెక్కించిన ఈ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు రోడ్ల మీదికొచ్చి ఆందోళనలు చేస్తున్నారు. అవేమీ పట్టనట్లుగా మీరు ఆ వార్తలనే ప్రసారం చేయడం లేదు, ప్రచురించడం లేదు. ఇప్పటికైనా మీరు ప్రజల పక్షం వహించి సమస్యలను ప్రసారం చేయకపోతే, త్వరలోనే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

జెన్ జీ ప్రభంజనం!

ప్రపంచ రాజకీయాల్లో కొత్త తరం తన ఉనికిని బలంగా చాటుకుంటోంది. దశాబ్దాలుగా అధికారాన్ని తమ గుప్పిట్లో ఉంచుకున్న రాజకీయ నాయకత్వాలకు, ప్రజల ఆకాంక్షలను నిర్లక్ష్యం చేసే పాలనా వ్యవస్థలకు యువత నుంచి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలతోనో, ఆకర్షణీయమైన నినాదాలతోనో యువతను మెప్పించడం ఇక అంత సులభం కాదు. అవినీతి, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అవకాశాల కొరత, భావప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు వంటి అంశాలపై యువత ప్రశ్నిస్తోంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని పాలకులపై నిరసన గళం వినిపిస్తోంది. నేపాల్ నుంచి ఫ్రాన్స్ వరకు వివిధ దేశాల్లో కనిపిస్తున్న యువత అసంతృప్తి సంప్రదాయ రాజకీయ వ్యవస్థలు తమ పనితీరును పునఃపరిశీలించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

సాధారణంగా 1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారిని జెన్ జీ తరానికి చెందినవారిగా పరిగణిస్తారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల మధ్య పెరిగిన ఈ తరానికి ప్రపంచ పరిణామాలపై సమాచారం వేగంగా అందుతోంది. పాలకుల ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో కనిపించే వాస్తవాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను గుర్తించి ప్రశ్నించే ధోరణి పెరుగుతోంది. రాజకీయ నాయకుల హామీలను గుడ్డిగా నమ్మడం కంటే, వాటి అమలు తీరును పరిశీలించే స్వభావం బలపడుతోంది. అయితే జెన్ జీ యువత అంతా ఒకే విధంగా ఆలోచిస్తుందని భావించడం సరికాదు. దేశం, ప్రాంతం, సామాజిక నేపథ్యం, ఆర్థిక పరిస్థితులను బట్టి వారి అభిప్రాయాలు మారుతాయి. అయినప్పటికీ పారదర్శక పాలన, సమాన అవకాశాలు, అవినీతిపై చర్యలు, ప్రభుత్వాల జవాబుదారీతనం కోసం యువత చేస్తున్న డిమాండ్లలో అనేక సామాన్యతలు కనిపిస్తున్నాయి.

2025 సెప్టెంబరులో నేపాల్‌లో చోటుచేసుకున్న యువజన నిరసనలు ఈ మార్పుకు ముఖ్యమైన ఉదాహరణగా నిలిచాయి. సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వ ఆంక్షలు నిరసనలకు తక్షణ కారణమైనప్పటికీ, యువతలో పేరుకుపోయిన అసంతృప్తి అంతకంటే లోతైనది. రాజకీయ అవినీతి, అధికార వర్గాల ప్రత్యేక హక్కులు, నిరుద్యోగం, ఆర్థిక అవకాశాల కొరత, రాజకీయ నాయకత్వంపై తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలు చాలాకాలంగా ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతున్నాయి. రాజకీయ ప్రముఖుల కుటుంబాలకు చెందినవారు విలాసవంతమైన జీవితాలు గడుపుతుండగా, సాధారణ యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాల్సి వస్తోందనే భావన కూడా అసంతృప్తిని తీవ్రతరం చేసింది. సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు ఈ ఆగ్రహానికి తక్షణ ప్రేరణగా మారాయి. నేపాల్‌లో నిరసనలు హింసాత్మక మలుపు తిరగడం, ప్రాణనష్టం సంభవించడం, రాజకీయ సంక్షోభం తీవ్రమవడం ఆ దేశ చరిత్రలో

కీలక పరిణామాలుగా నిలిచాయి. నిరసనల ఒత్తిడితో అప్పటి ప్రధాని కె.పి. శర్మ ఓలి రాజీనామా చేయడం, సుశీలా కార్కీ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడటం రాజకీయ వ్యవస్థపై ప్రజల ఒత్తిడి ఎంత ప్రభావవంతంగా మారగలదో తెలియజేశాయి. ఫ్రాన్స్‌లో కనిపిస్తున్న యువత అసంతృప్తిని కూడా ఇదే విస్తృత రాజకీయ నేపథ్యంలో పరిశీలించాలి. అయితే నేపాల్, ఫ్రాన్స్‌ల రాజకీయ వ్యవస్థలు, నిరసనలకు దారితీసిన కారణాలు భిన్నమైనవి. ఫ్రాన్స్‌లో జీవన వ్యయం, ఉద్యోగ భద్రత, విద్య, ప్రభుత్వ విధానాలు, ప్రజాసేవల నాణ్యత వంటి అంశాలపై వివిధ వర్గాల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. యువత తమ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తోంది. ఆర్థికాభివృద్ధి సాధించిన దేశాల్లోనూ అవకాశాల అసమానతలు, ఆర్థిక ఒత్తిళ్లు, భవిష్యత్తుపై అనిశ్చితి రాజకీయ అసంతృప్తికి కారణమవుతున్నాయి. సంపద పెరిగినంత మాత్రాన దాని ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వర్గానికి సమానంగా చేరవని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై చర్చించడం, శాంతియుతంగా నిరసన తెలియజేయడం కూడా ప్రజాస్వామ్య ప్రక్రియలో అంతర్భాగాలే. ప్రపంచవ్యాప్తంగా యువత అసంతృప్తికి ప్రధాన కారణాల్లో నిరుద్యోగం ఒకటి. ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ తగిన ఉద్యోగాలు లభించకపోవడం, ఉద్యోగాలు దొరికినా జీవన వ్యయాలకు సరిపడా ఆదాయం లేకపోవడం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లాల్సి రావడం యువతలో నిరాశను పెంచుతున్నాయి. మరోవైపు రాజకీయ పలుకుబడి ఉన్నవారికి అవకాశాలు సులభంగా లభిస్తున్నాయనే భావన అసమానతలపై ఆగ్రహాన్ని పెంచుతోంది. అర్హతకు బదులుగా పరిచయాలకు, ప్రతిభకు బదులుగా పలుకుబడికి ప్రాధాన్యం లభిస్తోందనే అభిప్రాయం ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. అందుకే యువత కోరుకుంటున్న మార్పు కేవలం నాయకుల మార్పు కాదు. నియామకాల్లో పారదర్శకత, విద్యలో నాణ్యత, ఉపాధిలో సమాన అవకాశాలు, అవినీతిపై చర్యలు, ప్రభుత్వ సేవల్లో జవాబుదారీతనం కూడా వారి ఆకాంక్షల్లో భాగమే. ఈ పరిణామాలు భారతదేశానికి కూడా ముఖ్యమైన పాఠాలను అందిస్తున్నాయి. యువత దేశానికి కీలకమైన మానవ వనరు. వారి శక్తి, సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం దేశాభివృద్ధికి దోహదపడగలవు. అయితే విద్యావకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకత వంటి అంశాలపై తగిన శ్రద్ధ చూపకపోతే ఆ శక్తి అసంతృప్తిగా మారే ప్రమాదం ఉంది. జెన్ జీ సవాల్ సంప్రదాయ రాజకీయ నాయకత్వానికి మాత్రమే కాదు; ప్రజాస్వామ్యాన్ని కేవలం అధికారాన్ని పొందే సాధనంగా భావించే రాజకీయ సంస్కృతికి కూడా హెచ్చరిక. ఎన్నికల్లో విజయం సాధించడం అధికారానికి మార్గం చూపవచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతర జవాబుదారీతనం, పారదర్శకత, సమర్థవంతమైన పాలన అవసరం. యువతకు కావాల్సింది కేవలం కొత్త ముఖాలు కాదు; కొత్త ఆలోచనలు, సమాన అవకాశాలు, అవినీతికి తావులేని వ్యవస్థ, తమ భవిష్యత్తుపై భరోసా. నేపాల్ నుంచి ఫ్రాన్స్ వరకు వినిపిస్తున్న యువత గొంతు ప్రపంచ రాజకీయాలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ప్రజల ప్రశ్నలను నిర్లక్ష్యం చేసే పాలనకు సవాళ్లు తప్పవు. యువత ఆకాంక్షలకు స్పందిస్తూ, ఉపాధి అవకాశాలను పెంచుతూ, పారదర్శక పాలనను అందిస్తూ, ప్రజాస్వామ్య విలువలను గౌరవించే నాయకత్వమే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలదు. యువత ఆగ్రహాన్ని అర్థం చేసుకుని సంస్కరణలకు ముందడుగు వేసే ప్రభుత్వాలు మార్పులో భాగస్వాములవుతాయి. ఆ గొంతును అణచివేయాలని చూసేవి ప్రజలకు మరింత దూరమవుతాయి. జెన్ జీ ప్రభంజనం చెబుతున్న పాఠం ఒక్కటే–అధికారం ప్రజల కోసం పనిచేసినప్పుడే దానికి నిజమైన గౌరవం, విశ్వసనీయత లభిస్తాయి.

నిరసన హక్కు.. నీకేదీ దిక్కు?

ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలకు పదేపదే చాటి చెబుతుంటారు. కానీ నేడు దేశంలో జరుగుతున్న నిరసనలు, ఉద్యమాలను ప్రభుత్వం ఎంతగా అణచివేస్తోందో పరిశీలిస్తే ఆయన మాటలకు, చేతలకు పొంతన ఎక్కడా కనిపించదు. మొలకు రొయ్యల తాడు కట్టుకున్న పిల్లి శాంతి మంత్రం జపించిందన్న సామెత గుర్తుకు రాకమానదు. ఎన్నో ఉద్యమాలు సాగిస్తేనే కానీ మన దేశానికి బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర్యం సిద్ధించలేదు. స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ చేపట్టిన దండియాత్ర ప్రపంచం లోని ఇతర పౌరహక్కుల ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమైంది. స్వాతంత్ర్యం కోసం శాసనోల్లంఘన ఉద్యమం వివిధ దశల్లో అనేకసార్లు కొనసాగింది. ఈ ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఊహాశక్తిని ఎంతగానో ఆకర్షించింది. 1952లో దక్షిణాఫ్రికాలో జరిగిన శాసన ధిక్కార ఉద్యమంలో నల్లజాతీయులు వర్ణవివక్షకు సంబంధించిన చట్టాలను ఉల్లంఘించారు. 1960లో అమెరికాలో నల్లజాతీయులు చేపట్టిన పౌరహక్కుల ఉద్యమం లో భాగంగా శాసనోల్లంఘన చేపట్టి విజయం సాధించారు. ఆదర్శనీయమైన మన దేశ అహింసాయుత ఉద్యమ వారసత్వానికి ఇప్పుడు మోడీ ప్రభుత్వం పాతర వేస్తోంది. ఇప్పుడు దేశంలో చిన్నచిన్న నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తులను రోజుల తరబడి జైళ్లలో నిర్బంధించడం పరిపాటి అవుతున్నప్పుడు ప్రజాస్వామ్యానికి అర్థమేమైనా ఉందా? చట్టాల్లోని నిబంధనలను దుర్వినియోగం చేస్తూ ఇష్టారాజ్యంగా నిరసనకారులపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయమా? భారత్ లోని నిరసనలు ఐక్యరాజ్యసమితి దృష్టికి వెళ్లినా భారత ప్రతినిధి దానిని ఖండించారే తప్ప వాస్తవాలను అంగీకరించలేదు. దేశ రాజధాని లోని నిరసన ప్రదర్శనలకు కేటాయించిన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను ప్రభుత్వం తొలగించడం నిజమే. అయితే కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లు జంతర్ మంతర్ లోకి ప్రవేశించి, నిరసనలో భాగంగా జాతీయ జెండాను ప్రదర్శించినందుకు వారిని ఎనిమిది రోజులపాటు కటకటాల వెనక్కి పంపడం దేశ ప్రజాస్వామ్య ప్రతిష్టను దిగజార్చడమే. అమెరికాలో పౌర అవిధేయత ఉద్యమానికి నాయకత్వం వహించిన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ "న్యాయం కోసం పోరాడే సమయంలో ఎదురయ్యే కష్టాలు, బాధలు వృథా కావు. అవి

సమాజంలో మార్పుకు మార్గం చూపిస్తాయి" అని అందించిన సందేశం ఇప్పటి కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు ఊపిరిపోస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు, స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు కీలకమైనవి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన పేరుతో ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ సాగించిన అవకతవకలపై కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో చేపట్టిన నిరసనలు మోడీ ప్రభుత్వానికి భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. అక్టోబర్ 1011 తేదీల్లో సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఇతర ఉద్యమకారులు, ప్రతిపక్ష నాయకులు, భారీ ఎత్తున నిరసనలు చేపట్టగా వారిని అరెస్టు చేశారు. జంతర్ మంతర్‌కు వారు వెళ్లకుండా రోడ్లపై బారికేడ్లు, రైళ్ల రవాణాపై ఆంక్షలు, మొబైల్ ఇంటర్నెట్ సర్వీసులు నిలుపుదల చేశారు. అక్టోబర్ 17న అభిజీత్ దీప్కేను కోర్టు విడుదల చేసింది. శాంతిభద్రతలను కాపాడడం పోలీసుల విధ్యుక్త ధర్మమే అయినప్పటికీ, నిరసనకారుల అరెస్టులు లేదా నిర్బంధం అవసరమా, చట్టబద్ధమా, తగిన కారణాలు ఉన్నాయా అనే అంశాలను కూడా పోలీసులు పరిశీలించాలి. చట్టపరమైన ఆధారం లేకుండా వ్యక్తులను నిర్బంధిస్తే వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినట్టే. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 జీవితాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను రక్షిస్తుంది. ఆర్టికల్ 22 అరెస్టు, నిర్బంధానికి సంబంధించిన కొన్ని రక్షణలను కల్పిస్తుంది. మరి మోడీ ప్రభుత్వం నిరసనకారులకు ఎంతవరకు రక్షణ కల్పిస్తుందో తెలిసిందే. అక్టోబర్ నిరసనల సందర్భంగా పాత్రికేయుల నిర్బంధం, పరికరాల స్వాధీనం, రిపోర్టింగ్‌కు ఆటంకాలపై తీవ్ర ఆరోపణలు వచ్చినట్టు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. దీన్ని బట్టి దేశంలో పాత్రికేయులను కూడా కేంద్ర ప్రభుత్వం టార్గెట్ చేసుకుంటోంది. నిరసనలే కాదు ప్రభుత్వ పాలనపై వ్యంగ్య ధోరణిలో విమర్శించే కార్టూన్లపై కూడా పగపట్టింది. ఈ ఏడాది సెప్టెంబర్ 28 నుంచి ఒక వారం రోజుల పాటు, ఆ తర్వాత అక్టోబర్ 20న (మంగళవారం) కేంద్ర ప్రభుత్వం తన కార్టూన్లకు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను బ్లాక్ చేసిందని ప్రముఖ కార్టూనిస్టు సతీస్ ఆచార్యం వెల్లడించారు. రాజకీయ కార్టూన్లను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, ఆ భయపడడం మానేసేంత వరకు ఈ కార్టూన్ల ప్రదర్శన కొనసాగుతుందని సతీష్ ఆచార్య నిర్భయంగా ప్రకటించారు. ప్రభుత్వానికి అభ్యంతరం కలిగిస్తున్న కంటెంట్‌ను తొలగించాలని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు మార్చి నుంచి జులై మధ్య కాలంలో దాదాపు 2 లక్షల ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయడం గమనార్హం. అంటే దాదాపు ప్రతి రోజూ 1275 ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి జారీ అవుతున్నాయని తెలుసుకోవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌కు అత్యధికంగా దాదాపు 1 లక్ష బ్లాకింగ్ ఉత్వర్వులు అందగా, ఫేస్‌బుక్‌కు 80,000, యూట్యూబ్‌కు దాదాపు 15,000 ఆదేశాలు వచ్చాయి. ఏదేమైనా కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణి నాటి వలస పాలకుల దురహంకారాన్ని ప్రతిబింబిస్తోంది. సిజెపి నేతల నిరసనలను అడ్డుకోవడానికి అరెస్టులు సాగించడం దేశ ఉద్యమాల వారసత్వానికి విఘాతం కలిగించడమే.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

అంతర్జాతీయ ఆర్ట్ ప్రదర్శనకు అతిథిగా త్రీడీ ఆర్టిస్ట్ ఎస్ ఎస్ ఆర్ కృష్ణ

రామగిరి,అక్టోబర్ 23 వార్త సంధ్య
ప్రముఖ అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్, జేఎన్టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకుడు సింగారపు శివరామకృష్ణ ఇండోనేషియాలో జరగనున్న ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా,క్యూరేటర్ గా వ్యవహరిస్తున్నారు.ఇండోనేషియా ప్రభుత్వ మంత్రిత్వ శాఖ సహకారంతో సెకోల టింగి మల్టీమీడియా,మల్టీమీడియా కాలేజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అక్షర నుసంత రా దునియా అంతర్జాతీయ ప్రదర్శన అక్టోబర్ 28 నుండి నవంబర్ 10,2026 వరకు ఇండోనేషియాలోని యోగ్యకార్త నగరంలో జరగనుంది.ఈ ప్రదర్శనలో 20 దేశాల నుండి 175 మంది కళాకారులు వేసిన 272 చిత్రాలు "ప్రపంచ లిపుల చారిత్రక వారసత్వం" అనే అంశంపై ప్రదర్శించనున్నారు.విశేషం ఏమిటంటే, ఎస్ఎస్ఆర్ కె అకాడమీ నుంచి ఈ ప్రదర్శనకు కృష్ణ శిష్యులు 17 మంది వేసిన చిత్రాలు కూడా ఎంపిక అయ్యాయి. కృష్ణ ప్రత్యేకంగా సృష్టించిన త్రీడి ఆర్ట్ ను రెండు వారాల పాటు ప్రదర్శించనున్నారు. ఇండోనేషియా,ఇండియా,ఇరాన్,చైనా, అర్జెంటీనా,కొలంబియా, ఫ్రాన్స్,జర్మనీ,కెన్యా, మొరాకో, మయన్మార్,పోలాండ్,రష్యా, సెర్బియా, సిరియా, టర్కీ,ఉక్రెయిన్,ఉరుగ్వే తదితర దేశాలు పాల్గొంటున్నాయి. ప్రదర్శన ప్రారంభోత్సవం అక్టోబర్ 28 ఉదయం 9 గంటలకు ఇండోనేషియా డిప్యూటీ మంత్రి నేజర్ పత్రియ చేతుల మీదుగా జరగనుంది.తనకు ఈ అవకాశం ఇచ్చిన,ఈవెంట్ నిర్వాహకులు,మిత్రులు మియోస సెప్ట కి కృష్ణ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.భారత దేశం తరుపున ప్రదర్శనకు ఎన్నికైన పిల్లలు,వారి తల్లిదండ్రులు కృష్ణ కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ అధికారుల సిబ్బంది నిర్లక్ష్యం

అక్టోబర్ 23 వార్త సంధ్య మంథని,
మంథని పట్టణంలోని గోదావరి తీరానికి వెళ్లే దారిలో పక్కకు ఉన్నటువంటి స్తంభాలను విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను, రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం రాబోయే పుష్కరాలకు సంబంధించి అధికారులు పనిచేస్తూ ఉంటే విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం మాత్రం ఏ విధంగా ఉందో రోడ్డు నిర్మాణం పనులు చూస్తే స్పష్టంగా కనబడుతుంది. విద్యుత్ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి అడ్డుగా ఉన్నటువంటి స్తంభాలను తొలగించి నాణ్యత ప్రమాణాలు, నిబంధనలు, ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని భద్రత నియమాలను పాటిస్తూ పుష్కర అభివృద్ధికి చేసే పనులకు విద్యుత్తు అధికారులు సహకరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

మానేరు నీటిలో మునిగి పంచాయతీ కార్యదర్శి మృతి

మంథని, అక్టోబర్ 23 వార్త సంధ్య
పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మానేరులో సూరయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శనిగరపు జైపాల్ 36 మృతి చెందాడు. జైపాల్ టేకుమట్లకు వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారం ఓడేడు మానేరు వద్ద స్నానం చేసేందుకు వెళ్లి భార్య, భర్తలు ప్రమాదవశాత్తు నీటిలో మునిగారు. స్థానికులు గమనించి పంచాయతీ కార్యదర్శి భార్యను రక్షించారు. అప్పటికే పంచాయతీ కార్యదర్శి జైపాల్ నీటిలో మునిగిపోయాడు. జైపాల్ స్వస్థలం జమ్మికుంట కాగా ప్రస్తుతం రామగిరి మండలం బేగంపేటలో నివాసం ఉంటున్నాడు. అతని భార్య గోదావరిఖని ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రెండు సంవత్సరాల పాప ఉంది. ఆమెకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం కరీంనగర్ కి తరలించారు. ముత్తారం పోలీసులు కేసు నమోదు చేసుకొని కార్యదర్శి జైపాల్ మృతదేహాన్ని మంథనికి పోస్టుమార్టం తరలించారు. పంచాయతీ కార్యదర్శి జైపాల్ మృతి పట్ల మంథని ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు..

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన అరవింద్ కల్యాణ్

విషాదంలోనూ మానవత్వం చాటిన కుటుంబ సభ్యులు..
సదాశయ ఫౌండేషన్ ప్రతినిధుల అభినందనలు

రామగిరి,అక్టోబర్ 23 వార్త సంధ్య
రోడ్లు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి నేత్రాలను దానం చేసె ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించేలా నిర్ణయం తీసుకున్న కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన ముత్తె అరవింద్ కల్యాణ్ (32) ఈ నెల 22న హన్నకొండలో జరిగిన బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషాద సమయంలో అయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు రావడం పలువురికి అదర్శంగా నిలిచింది.అరవింద్ కల్యాణ్ సమీప బంధువు లగిశెట్టి రాజకిశోర్ నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అయన సూచనతో నేత్రదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ఎల్వీపీ టెక్నిషియన్ నరేందర్ సహకారంతో మృతుడి కార్నియాలను సేకరించి హైదరాబార్ ఐ బ్యాంకెకు పంపించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలిగింది.

కుటుంబ సభ్యులకు అభినందనలు
నేత్రదాత అరవింద్ కల్యాణ్కు పలువురు నివాళు లర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ముత్తె కల్యాణి, చంద్రమౌళి, సోదరుడు ముత్తె సుమన్ పాటు నేత్రదానంపై అవగాహన కల్పించిన లగిశెట్టి రాజకిశోర్ నన్ను అభినందించారు.

సదాశయ ఫౌండేషన్ అభినందనలు
సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు లగిశెట్టి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు అరేపల్లి రాజమౌళి, కె. సమ్మయ్య తదితరులు నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

వార్డు సభ్యుల పోరం అధ్యక్షులుగా చేతి సుధాకర్,గౌడ వైష్ణవి ఘన విజయం

రామగిరి,అక్టోబర్ 23 వార్త సంధ్య
రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన రామగిరి మండల వార్డు సభ్యుల ఫోరం అధ్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధించింది.ప్రత్యర్థులను పూర్తిగా తుడిచిపెడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పన్నూర్ చేతి సుధాకర్ ఘన విజయం సాధించారు.మొత్తం పోలైన ఓట్లలో కాంగ్రెస్ పార్టీకి 42 ఓట్లు రాగా, ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీ కేవలం 9 ఓట్లతో సరిపెట్టుకుని ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.దీంతో సుధాకర్ 33 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. రామగిరి మండల మహిళా వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షురాలిగా గౌడ్ వైష్ణవి ఎన్నికయ్యారు.తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాలు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు సూచనల మేరకు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ వ్యూహాత్మకంగా వ్యవహరించి పార్టీ శ్రేణులను నడిపించారు. రామగిరి మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు,వివిధ గ్రామాల కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు,సీనియర్ నాయకులు సైనికుల్లా ఐక్యంగా పనిచేస్తూ పార్టీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా వార్డు సభ్యులతో సమన్వయం చేసుకున్నారు.ఈ సందర్భంగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై వార్డు సభ్యులు కాంగ్రెస్ వైపు ఏకతాటిపై నిలబడ్డారని తెలిపారు. ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టి కాంగ్రెస్ అభ్యర్థి పన్నూర్ చేతి సుధాకర్‌కు మద్దతుగా ఓటు వేసిన వార్డు సభ్యులకు ఆయన శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ ఎన్నికల విజయానికి కీలక పాత్ర పోషించిన రామగిరి మండల సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు,గ్రామ శాఖ అధ్యక్షులు,ముఖ్య నాయకులు,కార్యకర్తల సమష్టి కృషిని కొనియాడుతూ వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.రామగిరి మండలంలో కాంగ్రెస్ ఘన విజయంతో పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్నంటాయి.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు సహకరించాలని ఆర్టీసీ ఎండికి వినతి పత్రం అందజేత

,మంథని, అక్టోబర్ 23 వార్త సంధ్య
మంథని పట్టణంలోని బస్టాండ్ ముందు రోడ్డు వెడల్పు లో భాగంగా చిరు వ్యాపారులకు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ నష్టపోతున్నందున తిరిగి షాపింగ్ కాంప్లెక్స్ ను నిర్మించడానికి ఆర్టీసీ బస్టాండ్ కు సంబంధించిన కొంత స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ఎల్లెంకి వంశీ కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టీజీ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. మంథని పట్టణంలోని బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఆవశ్యకతను వారి దృష్టికి తీసుకెళ్లారు. మంథని పట్టణం రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణికులు, వ్యాపారులు, పట్టణ ప్రజలకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం ద్వారా వ్యాపార కార్యకలాపాలకు అనుకూలమైన వసతులు కల్పించడంతో పాటు, పట్టణ వాణిజ్య అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే రోడ్డు విస్తరణలో భాగముగా షాపులు కోల్పోతున్న స్థానిక వ్యాపారులకు తిరిగి దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కలుగుతుందని ప్రయాణికులకు, ప్రజలకు సౌకర్యవంతముగా ఉంటుందని వివరించారు. ఈ నిర్మాణం ద్వారా బస్టాండ్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి, స్థానికంగా ఉపాధి అవకాశాల పెంపునకు కూడా దోహదపడే అవకాశం ఉందని వారు తెలిపారు. మంథని పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధులు ఇతర సంబంధిత చర్యలపై పరిశీలన జరిపి, నిర్మాణ పనులు చేపట్టేందుకు సహకరించాలని మంత్రులు ఆర్టీసీ ఎండీని వారు కోరారు. మంథని పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకొని, ప్రజలకు, వ్యాపార వర్గాలకు ప్రయోజనం చేకూరేలా కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు..

పేద మహిళల ఆర్థిక స్వావలంబనకు జీహెచ్ఎంసీ చేయూత

హైదరాబాద్, అక్టోబర్ 23 వార్త సంధ్య
బస్తీలు, మురికివాడల్లోని పేద మహిళల ఆర్థిక అభివృద్ధికి జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం కృషి చేస్తోందని కవాడిగూడ సర్కిల్ ప్రాజెక్టు అధికారిణి ఎ.శ్రీలత తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఏడు డివిజన్లలో 1,328 మహిళా పొదుపు జ్యోతి సంఘాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా రూ.10 కోట్ల వరకు తక్కువ వడ్డీకి రుణాలు అందించినట్లు వెల్లడించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు వ్యాపారాల విస్తరణకు రూ.50 వేల వరకు బ్యాంకు రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. బ్యాంకు రుణాలతో అనుసంధానమైన సంఘాల సభ్యులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల వరకు బీమా అందుతుందని చెప్పారు. మరణించిన సభ్యుల మిగిలిన రుణాన్ని రద్దు చేసే సౌకర్యం కూడా ఉందన్నారు. పేద మహిళలు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీలత సూచించారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

ఢిల్లీని కాదు.. చైనాతో సరిహద్దుల్ని కాపాడండి..

- మోదీపై అభిజీత్ దీప్కే విమర్శలు

న్యూఢిల్లీ వార్త సంధ్య

బీజేపీ ప్రభుత్వం కాపాడాల్సింది ఢిల్లీని కాదని.. చైనాతో ఇండియా పంచుకుంటున్న సరిహద్దును అని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే అన్నారు. తాజాగా చైనా సరిహద్దులో భారత జవాన్లతో చైనా సైన్యం ఘర్షణకు దిగుతుండటాన్ని దీప్కే తప్పుబట్టారు. సరిహద్దుల్ని కాపాడటానికి వినియోగించాల్సిన సైన్యాన్ని దేశంలో నిరసనల్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం వాడుతోందని దీప్కే విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు.అరుణాచల్ ప్రదేశ్‌లో, ఇండియా-చైనా సరిహద్దులో నిత్యం ఏదో ఒక చోట ఘర్షణ జరుగుతూనే ఉందని తాజాగా ఐటీబీబీపీ చీఫ్ శత్రుజీత్ కపూర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. మన సైన్యానికి, అక్కడ పని చేస్తున్న భారత సైన్యమైన ఐటీబీపీకి మధ్య కొద్ది రోజులుగా నిత్యం ఘర్షణ జరుగుతోందని ఆయన తెలిపారు. ఇక్కడ సరిహద్దు కోసం కేంద్రం కొత్తగా తయారు చేసిన శౌర్య కమాండోలు ధైర్యంగా పని చేస్తున్నట్లు కపూర్ తెలిపారు. ఇప్పుడు ఇదే అంశంపై దీప్కే కేంద్రాన్ని, ప్రధాని మోదీని ప్రశ్నించారు. సైన్యాన్ని వాడుకోవడంలో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటని దీప్కే నిలదీశారు.దేశ సరిహద్దుల్ని రక్షించాల్సిన సైన్యాన్ని సొంత ప్రజలు నిరసన చేయకుండా వాడటం వల్లే చైనా సరిహద్దులో ఘర్షణ జరుగుతోందన్నారు. సొంత ప్రజల్ని అణచివేసేందుకు మోదీ దేశ భద్రతను పణంగా పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం రక్షించాల్సింది ఢిల్లీని కాదని.. సరిహద్దుల్ని అని దీప్కే సూచించారు. శాంతియుత నిరసనల్ని అడ్డుకోవడం సరికాదన్నారు. మరోవైపు సరిహద్దులో చైనాతో చెలరేగుతున్న ఘర్షణపై కాంగ్రెస్ పార్టీ, శివసేన యూబీటీలు కూడా కేంద్ర ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని విమర్శిస్తున్నాయి.

అమితాబ్ ఇంటికి బాంబు బెదిరింపు!

- ముంబై మేయర్ కార్యాలయానికీ బెదిరింపు మెయిల్
- అక్టోబర్ 31న పాఠశాలపై దాడి చేస్తామంటూ హెచ్చరిక
- నవంబర్ 27న దిల్జీత్ సంగీత ప్రదర్శన లక్ష్యమని సందేశం
- నగరంలో హైఅలర్ట్ ప్రకటించిన ముంబై పోలీసులు
- బెదిరింపు మెయిల్‌పై ముమ్మర దర్యాప్తు

న్యూఢిల్లీ వార్త సంధ్య

బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసంతో పాటు ముంబై మేయర్ కార్యాలయం, ప్రముఖ గాయకుడు దిల్జీత్ దోసాంజి సంగీత ప్రదర్శనపై దాడులు చేస్తామంటూ వచ్చిన బెదిరింపు మెయిల్ కలకలం రేపింది. ముంబై మేయర్ రీతూ తవాడేకు పంపిన మెయిల్‌లో మేయర్ కార్యాలయం వద్ద బాంబు పేలుడు సంభవిస్తుందని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ సంజయ్ ఘాడీకి కూడా బెదిరింపులు అందాయి. అక్టోబర్ 31న ఓ పాఠశాలపై గ్రేనేడ్ దాడి చేస్తామని, జూహూలోని అమితాబ్ బచ్చన్ నివాసం జల్సాపై అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27 మధ్య దాడి చేస్తామని సందేశంలో పేర్కొన్నారు. నవంబర్ 27న మహాలక్ష్మి రేస్‌కోర్సు ప్రాంతంలో జరగనున్న దిల్జీత్ దోసాంజి సంగీత ప్రదర్శనను కూడా లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు నగరంలో అప్రమత్తత ప్రకటించారు. బెదిరింపు సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేపట్టాయి. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. మేయర్ కార్యాలయం పరిసరాల్లో భద్రతను పెంచడంతో పాటు బెదిరింపుల్లో ప్రస్తావించిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఖలిస్థానీ పేరుతో ఈ హెచ్చరికలు వచ్చినట్లు సమాచారం ఉన్నప్పటికీ, వాటిని ఎవరు పంపారనే విషయంపై స్పష్టత రాలేదు. మెయిల్ మూలాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నారు.

ఇంజినీరు కాకున్నా ఎగిరే కారు తయారు చేశాడు!

ఉత్తరాఖండ్‌వాసి అద్భుతం

అల్మోరా వార్త సంధ్య

ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాకు చెందిన రవి తామ్తా ఎలాంటి ఇంజినీరింగ్ విద్య లేకుండానే సొంతంగా ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ కారు(ఎగిరే కారు) ప్రొటోటైప్‌ను విజయవంతంగా తయారు చేశాడు.'హోపిడా స్కై ప్రైవేట్ లిమిటెడ్' ద్వారా 2015 నుంచి ఈ ఆలోచనపై పనిచేస్తూ, ఇంటర్నెట్ సమాచారాన్ని నమ్ముకుని, తన తండ్రి సహకారంతో ఈ ప్రయోగాన్ని సాకారం చేశాడు. 'హోపిడా స్కైనెక్స్' అని పేరు పెట్టిన ఈ వాహనం రన్ వే అవసరం లేకుండా నిలువుగా టేకాఫ్, ల్యాండిగ్ చేయగలదు.

ప్రేమించండి.. కానీ గర్ల్‌ఫ్రెండ్‌ను తల్లిని చేసి వదిలేయొద్దు.

- అబ్బాయిలకు యూపీ గవర్నర్ కీలక సూచన!

న్యూఢిల్లీ వార్త సంధ్య

ప్రేమ, వివాహబంధంపై యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ వ్యాఖ్యలు మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. లక్నోలోని ఓ ప్రైవేటు కళాశాల ఏడో స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆమె.. ప్రేమ పేరుతో ఓ అమ్మాయితో బంధం ఏర్పరచుకుని, ఆమె తల్లయ్యాక ఒంటరిగా వదిలేయడం సరికాదని అన్నారు. ప్రేమలో ఉండటంలో తప్పు లేదని, అయితే పెళ్లి చేసుకుంటానని మాటిస్తే దాన్ని నిలబెట్టుకోవాలని యువతకు సూచించారు. ప్రేమిస్తే ప్రేమించండి.. కానీ ప్రేమ పేరుతో అమ్మాయిని తల్లిని చేసి మోసం చేయకండి అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి."గర్ల్‌ఫ్రెండ్ ఉండటంలో తప్పు లేదు. కానీ, పెళ్లి చేసుకుంటానని మాటిస్తే ఆ మాటను నిలబెట్టుకోవాలి" అని ఆనందీబెన్ పటేల్ స్పష్టం చేశారు. చిన్న వయసులోనే బాలికలు తల్లులవడం, ఆ తర్వాత వారి భాగస్వాములు వారిని విడిచిపెట్టడం ఆందోళనకరమని అన్నారు. "13-14 ఏళ్ల వయసులో ఓ అమ్మాయిని తల్లిని చేసి, ఆ తర్వాత ఆమెను ఒంటరిగా వదిలేయడం సరికాదు" అని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. అయితే ప్రభుత్వ చర్యలతోపాటు సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలని సూచించారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధానికి మాత్రమే పరిమితం కాదని గవర్నర్ అన్నారు. దాంతో పాటు కుటుంబ బాధ్యతలు కూడా వస్తాయని గుర్తుచేశారు. యువత ముందుగా ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగాలని, కుటుంబాన్ని పోషించే స్థాయికి చేరుకున్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించాలని సూచించారు. భవిష్యత్తులో కలిసి జీవించాలనే హామీలు ఇచ్చే ముందు వాటి పరిణామాలను అర్థం చేసుకోవాలని, భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకోకుండా ఆచితూచి వ్యవహరించాలని హితవు పలికారు. ఆనందీబెన్ పటేల్ గతంలోనూ సంబంధాలు, కుటుంబ విలువలపై చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. అమ్మాయిలు కెరీర్ కంటే ముందు మంచి తల్లిగా మారాలని గతంలో ఆమె చేసిన సూచనలు వివాదాస్పదమయ్యాయి. అలాగే 2025 అక్టోబరులో బల్లియా, వారణాసిలో జరిగిన విశ్వవిద్యాలయ కార్యక్రమాల్లో మాట్లాడుతూ.. యువతులు సహజీవన సంబంధాల్లోకి వెళ్లే ముందు వాటి పరిణామాలను ఆలోచించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

యూపీలో పొత్తుకు సీట్ల పీటముడి!

- సమాజ్‌వాదీ పార్టీతో పొత్తుకు కాంగ్రెస్ ప్రయత్నాలు
- 403 స్థానాల్లో 200 సీట్లు కావాలంటూ ప్రతిపాదన
- గతంలో 50 సీట్లకే అంగీకరించిన ఎస్పీ
- సీట్ల సర్దుబాటుపై ప్రియాంకాగాంధీ సమాలోచనలు
- కాంగ్రెస్ డిమాండ్‌పై అఖిలేశ్ నిర్ణయంపై ఉత్కంఠ

న్యూఢిల్లీ వార్త సంధ్య

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రతిపక్ష పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంశం చర్చనీయాంశంగా మారింది. అధికార బీజేపీని ఎదుర్కొనేందుకు సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు కొనసాగించాలని భావిస్తున్న కాంగ్రెస్ ఏకంగా 200 అసెంబ్లీ స్థానాలను కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలు ఉండగా, దాదాపు సగం సీట్లను తమకు కేటాయించాలని కాంగ్రెస్ ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ఈ డిమాండ్‌పై ఇరు పార్టీల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. గతంలో కాంగ్రెస్‌కు 50 స్థానాలు కేటాయించేందుకు సమాజ్‌వాదీ పార్టీ సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అప్పట్లో కాంగ్రెస్ 150 సీట్లు కోరగా, ఎస్పీ అందుకు అంగీకరించలేదని సమాచారం. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ గతంలో తమ పార్టీ 350 స్థానాల్లో, కాంగ్రెస్ 53 స్థానాల్లో పోటీ చేసే ప్రతిపాదనను ప్రస్తావించారు. తాజాగా కాంగ్రెస్ డిమాండ్ 200 సీట్లకు పెరిగినట్లు ప్రచారం జరుగుతుండటంతో సీట్ల సర్దుబాటు వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ ఉత్తరప్రదేశ్ పార్టీ నాయకులతో సమావేశమై ఎన్నికల సన్నాహాలు, పొత్తులు, సీట్ల పంపకాలపై చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తాజా ప్రతిపాదనపై అఖిలేశ్ యాదవ్ ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2027 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల మధ్య పొత్తు చర్చలు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తాజా అక్టోబర్ 23 కథనాల ప్రకారం కాంగ్రెస్ 170 నుంచి 180 స్థానాల జాబితాను చర్చలకు అందించినట్లు సమాచారం. 200 సీట్ల డిమాండ్‌పై వార్తలు వచ్చినప్పటికీ, ఆ సంఖ్యలను అఖిలేశ్ యాదవ్ ధ్రువీకరించలేదు. సీట్ల పంపకంపై తుది ఒప్పందం ఇంకా కుదరలేదు

ఢిల్లీలో మళ్లీ భగ్గుమన్న 'సర్' వ్యతిరేక ఆందోళనలు!

- ఓట్ల తొలగింపును నిరసిస్తూ ఈసీ కార్యాలయానికి ర్యాలీ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- ర్యాలీని అడ్డుకుని పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రైతులు, విద్యార్థులు, పౌర సంఘాల ఆధ్వర్యంలో నిరసన
- ఢిల్లీలో అదనంగా 273 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపు

న్యూఢిల్లీ వార్త సంధ్య

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి ఆందోళనలు మొదలయ్యాయి. సర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం రైతులు, విద్యార్థులు, పౌర సంఘాల ప్రతినిధులు నిరసన ర్యాలీ చేపట్టారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు ర్యాలీని అడ్డుకుని పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని గురుద్వారా బంగ్లా సాహిబ్ నుంచి పటేల్ చౌక్ సమీపంలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని ఆందోళనకారులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో పాటు పలువురు నాయకులను నిర్వాహకులు ఆహ్వానించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓట్ల తొలగింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'హర్ గలీ జంతర్‌మంతర్.. హర్ గావ్ జంతర్‌మంతర్.. మేరా ఘర్ జంతర్‌మంతర్' అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ ముందుకు సాగకుండా పోలీసులు, భద్రతా బలగాలు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ భద్రతను కట్టుదిట్టం చేసింది. ఇప్పటికే భారీ సంఖ్యలో పోలీసులను మోహరించగా, అదనంగా 273 కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) కంపెనీలను రంగంలోకి దించినట్లు సమాచారం. తొలుత అక్టోబర్ 20 వరకు మాత్రమే ఈ బలగాలను కొనసాగించాలని భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో నెలాఖరు వరకు మోహరింపును పొడిగించినట్లు తెలుస్తోంది. ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, కీలక ప్రాంతాల్లో భద్రతను పెంచారు. నిరసనలు మరింత విస్తరించకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

స్టార్‌లింక్ సేవలపై ఇంకా ఆంక్షలు కొనసాగుతున్నాయి: ఉక్రెయిన్



కీవ్:వార్త సంధ్య

స్టార్‌లింక్ నెట్వర్క్ తో ఇంకా సమస్యలు వస్తూనే ఉన్నాయని ఉక్రెయిన్ చెబుతోంది. ఆ దేశ రక్షణ శాఖ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నది. ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ అప్‌లింక్ ఆంక్షలు ఎత్తివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పినా.. ఉక్రెయిన్‌లో మాత్రం స్టార్‌లింక్ సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే డ్రోన్లకు కనెక్షన్ లాస్ ఎదురవుతున్నట్లు చెబుతున్నారు. దీంతో మిలిటరీ ఆపరేషన్స్ అవరోధాలకు గురవుతున్నాయి.రష్యాతో యుద్ధం వేళ స్టార్‌లింక్ శాటిలైట్ సంబంధాలు కీలకంగా మారాయి. స్టార్‌లింక్‌కు చెందిన మిలిటరీ గ్రేడ్ శాటిలైట్ స్టార్‌షీల్డ్ .. ఉక్రెయిన్‌కు సేవలు అందించరాదు అని టెక్ బిలియనీర్‌కు ఆదేశాలు ఇవ్వలేదని ఇటీవల ట్రంప్ చెప్పారు. స్టార్‌షీల్డ్ మళ్లీ సేవల్ని అందిస్తున్నట్లు మస్క్ కూడా వెల్లడించారు. స్టార్‌లింక్ కానీ స్టార్‌షీల్డ్ పనితీరు నెమ్మదించడానికి తనకు ఎటువంటి సంబంధం లేదని మస్క్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. స్టార్‌లింక్ లేదా స్టార్‌షీల్డ్ సేవల్లో అంతరాయం వల్ల ఉక్రెయిన్ తన డ్రోన్ సామర్థ్యాన్ని సరిగా వినియోగించుకోలేకపోయింది. శాటిలైట్ కనెక్షన్ స్పీడ్ తగ్గడం వల్ల.. అటాక్ డ్రోన్లను వాడడం లేదా డిఫెన్సివ్ ఆపరేషన్స్‌ను సరైన రీతిలో కోఆర్డినేట్ చేయలేకపోతున్నది. స్టార్‌లింక్‌తో పాటు స్టార్‌షీల్డ్ నెట్వర్క్‌లను అనునిత్యం మానిటర్ చేస్తున్నామని ఉక్రెయిన్ రక్షణశాఖ వర్గాలు చెబుతున్నాయి. శాటిలైట్లపై ఉన్న ఆంక్షలను అమెరికా ఎత్తివేసినట్లు తమకు ఎటువంటి అధికారిక సమాచారం లేదని ఉక్రెయిన్ రక్షణశాఖ పేర్కొన్నది. లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్లకు అప్‌లింక్ స్పీడ్‌ను తగ్గించినట్లు కీవ్ ఇటీవల ఆరోపించింది. దీంతో డ్రోన్లు ప్రయాణించే వేగం తగ్గింది. 100 కిలోమీటర్ల కన్నా వేగంగా ప్రయాణించే డ్రోన్లకు సంబంధాలు తెగిపోతున్నట్లు అధికారులు గుర్తించారు. ఉక్రెయిన్ రక్షణ శాఖ తమ ఆపరేషన్స్ కోసం స్టార్‌షీల్డ్‌ను వాడుతోంది. అయితే ఆ శాటిలైట్‌ను అమెరికా మిలిటరీ కంట్రోల్ చేస్తోంది, ప్రస్తుతం వస్తున్న సమస్య వెనుక పెంటగాన్ హస్తం ఉన్నట్లు భావిస్తున్నారు. ఉక్రెయిన్ శాటిలైట్ నెట్వర్క్‌లపై ఆంక్షలు విధిస్తున్నట్లు వస్తున్న వార్తలను శ్వేతసౌధం ఖండించింది.

‘ఇడుపు కాయితం’ నుంచి సెకండ్

సింగిల్ ‘గడప’ పాట విడుదల

టాలీవుడ్ కథానాయకుడు ప్రియదర్శి హీరోగా, తెలంగాణ జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం ‘ఇడుపు కాయితం’. ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్ -- బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి సాంగ్ ‘శ్రీలత.. ఈ శ్రీనివాసుడే నీ జత..’ పాట ప్రస్తుతం వైరలవుతుండగా తాజాగా సెకండ్ సింగిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ గడప పాటను విడుదల చేయగా.. పెళ్లైన అనంతరం కొత్త కోడలు ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం అందించగా.. తేజు విజయ పాడారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.

సూర్య ‘సీన్’ చిత్రంలో

విలన్‌గా నస్లేన్.. గ్లింప్స్ విడుదల!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ‘సీన్’. కరుప్పు, విశ్వానాథన్ అండ్ సన్స్ వంటి వైవిధ్యమైన చిత్రాలతో దూసుకెళ్తున్న సూర్య ఈ చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాతో మలయాళ టాలెంటెడ్ నటుడు నస్లేన్ తమిళ చిత్ర పరిశ్రమలోకి గ్రాండ్‌గా అడుగుపెడుతున్నారు. ఇక బ్లాక్‌బస్టర్ మూవీ ‘ఆవేశం’ ఫేమ్ జితు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయితాజాగా ఈ సినిమాకు సంబంధించి చిత్ర యూనిట్ విడుదల చేసిన అప్‌డేట్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో నస్లేన్ ‘ఈశ్వరన్’ అనే విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ చిత్రంలో హీరో సూర్య ఒక శక్తివంతమైన పోలీస్ అధికారిగా డి.ఎస్.పి. ఇన్బరాజ్ పాండియన్ పాత్రలో కనిపించనున్నారు. సూర్య సరసన నజ్రియా ఫహాద్ నటిస్తుండగా, మలయాళ సంగీత సంచలనం సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్నారు. సూర్య, జ్యోతికల నూతన ప్రొడక్షన్ హౌస్ ‘జగరం స్టూడియోస్’ మరియు ‘2డి ఎంటర్‌టైన్‌మెంట్’ సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాను ప్రపంచవ్యాప్తంగా దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో అట్టహాసంగా విడుదల చేయనున్నారు. నస్లేన్ విలన్ ఎంట్రీ, సూర్య పోలీస్ గెటప్ కలిసి ఈ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి.

రూ.5000 కోట్ల వసూళ్లు సాధిస్తేనే సేఫ్..

భయపెడుతున్న ‘రామాయణ’ బ్రేక్ ఈవెన్ టార్గెట్!

భారతీయ చలనచిత్ర చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న నితీశ్ తివారీ చిత్రం ‘రామాయణ’ బాక్సాఫీస్ వద్ద భారీ సవాల్‌ను ఎదుర్కొనబోతుంది. ఈ సినిమాకు ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించంగా. సినిమా ఆర్థికంగా సక్సెస్ కావాలంటే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 5,000 కోట్లు రాబట్టాల్సి ఉంటుందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీపావళి కానుకగా నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్, ఓపెనింగ్స్, బాక్సాఫీస్ లెక్కలపై ట్రేడ్ ఎక్స్‌పర్ట్స్ పలు కీలక విషయాలు వెల్లడించారు. ఈ సినిమాకు ఏమాత్రం పాజిటివ్ టాక్ వచ్చినా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశం ఉందని, అయితే రూ. 2,000 కోట్ల భారీ బడ్జెట్‌ను రికవరీ చేయడం మాత్రం అంత ఆశామాషీ కాదని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయంగా తొలి రోజు అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలోనే రూ. 75 నుంచి రూ. 100 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 150 నుంచి రూ. 200 కోట్ల ప్రీ-సేల్స్ సాధిస్తేనే సినిమాకు బలమైన పునాది ఏర్పడుతుందని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నారు. ముఖ్యంగా బాలీవుడ్ మార్కెట్‌తో పాటు సౌత్ ఇండియన్ మార్కెట్ల నుంచి కనీసం 35 నుంచి 40 శాతం వసూళ్లు వస్తేనే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుంది. ఇక ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తుండగా, యశ్ రావణాసురుడిగా కనిపించనున్నారు. యశ్‌కు చెందిన మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్, నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ భారీ పాన్-ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రీవ్యూలు ప్రదర్శించనుండగా, నవంబర్ 5న సినిమా థియేటర్లలో సందడి చేయనుంది. కేవలం థియేట్రికల్ కలెక్షన్లే కాకుండా శాటిలైట్, డిజిటల్ మరియు ఇతర హక్కుల ద్వారా కూడా భారీ రాబడి వస్తేనే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ సురక్షితంగా బయటపడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

ఆ విషయంలో గర్వపడుతున్నా!

తన సినీ ప్రయాణంలో నటన మొదలుకొని భాష, సంభాషణలు పలికే విధానం, యాస.. ఇలా ఎన్నో విషయాల్లో విమర్శలను ఎదుర్కొన్నానని, అయితే వాటి కారణంగా తాను ఏనాడు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదని రష్మిక మందన్న స్పష్టం చేసింది. విజయ్ దేవరకొండతో కలిసి ఇటీవల ‘కాఫీ విత్ కరణ్’ సీజన్ 9లో పాల్గొన్న ఆమె తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ముఖ్యంగా హిందీ మాట్లాడే విధానం, దక్షిణాదియాసపై వస్తున్న విమర్శలకు గట్టిగా సమాధానమిచ్చింది. ‘నేను దక్షిణాది అమ్మాయిని. నా మాటల్లో ప్రాంతీయ యాస కనిపించడం సహజం. దానిని తప్పుగా అర్థం చేసుకోవద్దు. నేను నటించే ప్రతి సినిమాకు డబ్బింగ్ ఆర్టిస్టులతో సంభాషణలు చెప్పించుకునే అవకాశం ఉంటుంది. కానీ నేనే డబ్బింగ్ చెప్పాలని చాలా మంది దర్శకులు కోరుతున్నారు. భిన్న భాషల్లో సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పడం సవాలుతో కూడుకున్న పని. అన్ని భాషల్లో సొంతంగా డబ్బింగ్ చెప్పడం ఎంతో గర్వంగా భావిస్తున్నా’ అని రష్మిక మందన్న పేర్కొన్నది.

ప్రభాస్ పుట్టినరోజు స్పెషల్..

-‘కల్కి 2’ నుంచి అదిరిపోయే అప్‌డేట్, మళ్లీ బైరవగా డార్లింగ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ‘కల్కి 2898 ఏడీ’ చిత్రానికి కొనసాగింపుగా రూపొందనున్న ‘కల్కి 2’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందా? ప్రభాస్ మళ్లీ ఎప్పుడు సెట్స్‌లోకి అడుగుపెడతాడా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది.‘కల్కి 2’కు సంబంధించిన తాజా వీడియోలో ప్రభాస్‌ను మరోసారి బైరవ పాత్రలో చూపించే కొన్ని దృశ్యాలను చిత్రబృందం పంచుకుంది. దీంతో ఈ సినిమా గురించి ఎదురుచూస్తున్న అభిమానులకు కొత్త ఉత్సాహం వచ్చింది.మొదటి భాగంలో బైరవ పాత్రలో ప్రభాస్ చూపించిన విన్యాసాలు, తెరపై ఆయన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు రెండో భాగంలో ఆయన పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి మరింత పెరిగింది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ వీడియో సినిమా నిర్మాణంపై అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే ఈ వీడియోతోనే చిత్రీకరణ ప్రారంభ తేదీ ఖరారైనట్లు భావించకూడదు. షూటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తొలి భాగంలో కనిపించిన అద్భుతమైన ప్రపంచాన్ని మరింత విస్తరించేలా రెండో భాగాన్ని రూపొందించనున్నారనే అంచనాలు ఉన్నాయి. ప్రభాస్‌తో పాటు సాయిపల్లవి, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ వంటి ప్రముఖ నటీనటులు ఈ ప్రాజెక్టుతో సంబంధం కలిగి ఉన్నారు. సంగీతాన్ని సంతోష్ నారాయణన్ అందిస్తున్నారు. ‘కల్కి 2898 ఏడీ’ తొలి భాగం విజయంతో రెండో భాగంపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. కథలోని కీలక మలుపులు, ప్రధాన పాత్రల మధ్య సంబంధాలు, భవిష్యత్తు ప్రపంచం నేపథ్యంలో సాగే సంఘటనలు రెండో భాగంలో ఎలా ఉండబోతున్నాయనే విషయంపై అభిమానులు చర్చించుకుంటున్నారు.

వెంకటేష్ ‘ఆదర్శ కుటుంబం’ ఎఫెక్ట్..

విడుదల తేదీలు మార్చుకున్న చిన్న సినిమాలు!

టాలీవుడ్‌లో సినిమాల విడుదల తేదీల మార్పులు బాక్సాఫీస్ సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47’ చిత్రం అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించిన చిత్ర బృందం, ఆ తర్వాత అక్టోబర్ 9కి వాయిదా వేసింది. తాజాగా మరోసారి తేదీని మార్చి అక్టోబర్ 30న విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ మార్పుతో అదే రోజున విడుదల కావాల్సిన కొన్ని చిన్న సినిమాలు తమ ప్రణాళికలను మార్చుకున్నాయి.వెంకటేష్ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రావాలని భావించిన ‘ఇట్లు అర్జున’, ‘సమ్మర్ హాలిడేస్’ చిత్ర బృందాలు వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఈ రెండు సినిమాలను నవంబర్ 6న విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. పెద్ద హీరో సినిమా విడుదలైనప్పుడు థియేటర్ల కేటాయింపు, ప్రారంభ వసూళ్ల విషయంలో చిన్న చిత్రాలకు పోటీ ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందుకే ఒక వారం ఆలస్యంగా విడుదల చేస్తే థియేటర్లు అందుబాటులోకి రావడంతో పాటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేందుకు మెరుగైన అవకాశం లభిస్తుందని ఆయా చిత్రాల నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం.మరోవైపు, అక్టోబర్ 30న విడుదల చేయాలని భావించిన ‘చంద్రయాన్’, ‘ఏమో ఏమో ఇది’ చిత్రాల విడుదల ప్రణాళికల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ రెండు సినిమాల కొత్త విడుదల తేదీలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. చిత్ర బృందాలు త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. టాలీవుడ్‌లో పెద్ద సినిమాల విడుదల తేదీలు ఖరారైనప్పుడు, అదే సమయంలో విడుదలకు సిద్ధమవుతున్న చిన్న చిత్రాల నిర్మాతలు తమ ప్రణాళికలను మరోసారి పరిశీలించడం సాధారణమే. థియేటర్ల సమస్య, ప్రేక్షకుల ఆదరణ, ప్రారంభ వసూళ్లు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని విడుదల తేదీలను మార్చుకుంటుంటారు. ప్రస్తుతం ‘ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47’ అక్టోబర్ 30న విడుదల కానుండటంతో ఆ తేదీ చుట్టూ బాక్సాఫీస్ పోటీపై ఆసక్తి నెలకొంది. ‘ఇట్లు అర్జున’, ‘సమ్మర్ హాలిడేస్’ నవంబర్ 6కి వెళ్లగా, ‘చంద్రయాన్’, ‘ఏమో ఏమో ఇది’ కొత్త తేదీల కోసం ఎదురుచూస్తున్నాయి. అయితే ఈ విడుదల తేదీలకు సంబంధించిన తుది వివరాలు ఆయా చిత్ర బృందాల అధికారిక ప్రకటనలతో స్పష్టమవుతాయి.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.